

పేదల బియ్యం పక్కదారి

- కైలాసపురం 46వ నంబర్ రేషన్ డిపోలో వెలుగుచూసిన బాగోతం
- పర్యవేక్షిస్తున్న డీలర్ రాకపోవడంతో షట్టర్ విరగ్గొట్టి స్టాకు వివరాలు నమోదు చేసిన అధికారులు
- రెండున్నర టన్నులు తక్కువ ఉన్నట్టు గుర్తింపు

-6లో

రిజర్వు ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత అరెస్టు

- 22 వరకు రిమాండ్
- సబ్ రిజిస్ట్రార్‌ను బ్లాక్ మెయిల్ చేయడంలో నకిలీ ఏసీబీ సీఐకి సహకరించారని అభియోగం

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బి.స్వర్ణలతను పీఎం పాలెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన బలగా సుధాకర్ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి...ఏసీబీ సీఐనని చెప్పి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని డబ్బులు డిమాండ్ చేయడంతో పీఎంపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన సుధాకర్... కార్యాలయంపై తమకు చాలా ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై కేసు కట్టకుండా ఉండాలంటే రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో తమ ఉన్నతాధికారి మాట్లాడతారంటూ ఒక ఫోన్ నంబర్‌కు కాల్ చేసి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణితో మాట్లాడించారు. 'సీఐ గారు చెప్పినట్టు చేయండి. అంతా ఆయన చూసుకుంటారని' ఆ మహిళా అధికారి చెప్పారని పీఎం పాలెం పోలీసులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. దీంతో నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పీఎం పోలీసులు... ఏసీబీ ఉన్నతాధికారిగా పేర్కొంటూ ఎవరితో మాట్లాడించారనే దానిపై విచారణ చేపట్టారు. ఆ నంబర్ గతంలో విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం బాపట్లలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న స్వర్ణలతదిగా గుర్తించారు. దీంతో ఆమెను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు ఆమెకు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. కాగా స్వర్ణలత గతంలో నగరంలో ఆర్ఐగా పనిచేసినప్పుడు నోట్ల మార్పిడి వ్యవహారంలో బెదిరించి డబ్బులు గుంజారనే ఫిర్యాదు రావడంతో పోలీసులు అరెస్టు చేశారు.



స్వర్ణలత (ఫైల్ ఫొటో)

నగరంలో హైఅలర్ట్

పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తం

- బీచ్‌రోడ్డులో వాహనాల తనిఖీ

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరం సముద్ర తీరంలో ఉండడం, ఇక్కడే తూర్పు నావికాదళం ప్రధాన కార్యాలయం కూడా ఉండడంతో కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు హైఅలర్ట్ ప్రకటించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో నగర పోలీసులు గురువారం రాత్రి బీచ్‌రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులతో పాటు వాహనంలో ఉన్నవారి వివరాలను పరిశీలించారు. యారాడ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డు మొత్తాన్ని పోలీసులు తమ ఆధీనంలో తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. అనుమానితులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించి పూర్తిస్థాయిలో విచారించాలని అధికారులకు ఆదేశాలు అందినట్టు సమాచారం.



బీచ్‌రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల సీనియారిటీ జాబితాలు విడుదల

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు అర్హత కలిగిన స్కూలు అసిస్టెంట్లతో కూడిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఇంకా జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ పోస్టుల కోసం సెకండరీ గ్రేడ్ టీచర్లతో కూడిన తాత్కాలిక సీనియారిటీ జాబితా కూడా విడుదల చేశామని గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాలు 'సైట్స్.గూగుల్.కామ్,సైట్స్. డీఈవో వైజాగ్-2' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలలోగా తగిన ఆధారాలతో తెలియజేయాలన్నారు. అభ్యంతరం వ్యక్తంచేసిన ఉపాధ్యాయుడు/ఉపాధ్యాయురాలి పేరు, ప్రస్తుతం పనిచేస్తున్న హోదా, ఎక్కడ పనిచేస్తున్నారు? స్కూలు యూడైస్ కోడ్, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ జరిగిందో స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. అభ్యంతరాలు మార్పు చేయడానికి కావల్సిన ఆధారాలు, సాక్ష్యాలు తప్పనిసరిగా జత చేయాలని పేర్కొన్నారు.

నైట్ ఫుడ్‌కోర్టుపై పిల్లిమొగ్గలు

వైసీపీ నేతల ప్రోద్బలంతో పాత జైలురోడ్డులో అనధికారికంగా దుకాణాల ఏర్పాటు

- కొంతమందికి పదేసి దుకాణాలు...
- రోజుకు ఒక్కో దుకాణం నుంచి రూ.300 వరకూ మామూళ్లు వసూలు
- అక్కడి నుంచి తొలగించాలని గతంలో కూటమి కార్పొరేటర్ల పట్టు
- లేనిపక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించిన కార్పొరేటర్లు
- ఇప్పుడు ఫుడ్‌కోర్టు తొలగింపునకు కొంతమంది కార్పొరేటర్ల ససేమిరా
- ప్రస్తుతం ఉన్న దుకాణాలను తొలగించి, అవసరమైతే అదే ప్రాంతంలో జీవీఎంసీకి ఆదాయం వచ్చేలా, అర్హులైన వారికి డ్రా లేదా వేలం ద్వారా దుకాణాలు కేటాయించాలని మరికొందరి వాదన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ పీఠాన్ని చేజిక్కించుకున్నామనే సంతోషంలో ఉన్న కూటమి కార్పొరేటర్లలో నైట్ ఫుడ్ కోర్టు వ్యవహారం కల్లోలం రేపుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా పాత జైలురోడ్డులో నడుస్తున్న ఫుడ్ కోర్టును తొలగించాలని టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాల కార్పొరేటర్లు చాలాకాలంగా డిమాండ్ చేస్తూ వచ్చారు. వైసీపీ హయాంలో కౌన్సిల్‌లో కీలకంగా వ్యవహరించిన పెద్దలకు నెలవారీ వాటాలు అందడంతో వారంతా ఫుడ్ కోర్టు తొలగింపునకు మోకాలడ్డారు. ఈ నేపథ్యంలో తక్షణం ఫుడ్‌కోర్టుని తొలగించకపోతే ధర్నా చేస్తామంటూ టీడీపీ, జనసేన కార్పొరేటర్లు నాలుగు నెలల కిందట అధికారులకు అల్టిమేటం జారీచేశారు. కానీ మేయర్ పీఠం కూటమి హస్తగతం చేసుకున్న తర్వాత పరిస్థితి చూస్తే... ఫుడ్‌కోర్టు తొలగించాలని ఒక వర్గం పట్టుబడుతుండగా, మరొకవర్గం ససేమిరా అంటోంది.



పాత జైలు రోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్టు

పర్యాటకులతోపాటు నగరవాసులకు కూడా రాత్రివేళ ఆహారం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో పాత జైలురోడ్డులో ఫుడ్‌కోర్టు ఏర్పాటుచేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో కేవలం 32 దుకాణాలకు అనుమతి ఇచ్చారు. ఒక్కో దుకాణం ప్రతి నెలా జీవీఎంసీకి అద్దె చెల్లించేలా, ఆ మేరకు ఫుడ్‌కోర్టు పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ బాధ్యత నగర పాలక సంస్థ చూసుకునేలా ఆదేశాలు జారీచేశారు. కరోనా కారణంగా ఫుడ్‌కోర్టును మూసివేసేశారు. తర్వాత తిరిగి ప్రారంభించేందుకు వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నా...పారిశుధ్య సమస్య, ట్రాఫిక్ ఇబ్బందులు వంటి కారణాలతో జీవీఎంసీ అనుమతి ఇవ్వలేదు. అయినప్పటికీ వైసీపీ నేతల ప్రోద్బలం, జీవీఎంసీ కౌన్సిల్‌లో కీలకంగా వ్యవహరించిన ఆ పార్టీ కార్పొరేటర్లు కొందరి అండదండలతో ఎలాంటి అనుమతులు లేకుండానే ఫుడ్‌కోర్టును

... మిగతా 6వ పేజీలో

సిటీ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు

నగరానికి 200 బస్సులు కేటాయింపు

తొలివిడత 50 బస్సులు త్వరలో రాక

- ప్రధాన రహదారుల్లో నడిపేందుకు అధికారుల నిర్ణయం
- గాజువాక, సింహాచలం ప్రాంతాల్లో ప్రత్యేక గ్యారేజీలు, చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు

ద్వారకా బస్‌స్టేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని ప్రధాన రహదారులపై ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సమాయత్తమవుతున్నారు. విశాఖ రీజియన్‌కు నాలుగు విడతల్లో 200 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. అందులో మొదటి విడత 50 బస్సులు త్వరలో పంపనున్నట్టు ఆర్టీసీ విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం అందింది.

మొదటి విడత వచ్చిన ఈ-బస్సులను సింహాచలం, గాజువాక, మధురవాడ డిపోలను కేంద్రాలుగా చేసుకొని నడపాలని నిర్ణయించారు. గాజువాక డిపో వెనుక ఐదు ఎకరాల్లో, సింహాచలం డిపో వెనుక గల సింహపురి లేఅవుట్‌లో నాలుగు ఎకరాల్లో ఎలక్ట్రిక్ బస్సు డిపోలు ఏర్పాటుచేయనున్నారు. ఈ రెండు డిపోల నుంచి మొదటి విడత ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఈ రెండు స్థలాలను పరిశీలించారు. ఈ-గ్యారేజీ నిర్వహణ, చార్జింగ్‌కు ఏ మేరకు విద్యుత్ వినియోగమవుతుంది, ఎంత కెపాసిటీ కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నది అంచనా వేశారు. గాజువాక డిపో మేనేజర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అధికారులు, గ్యారేజీ అధికారులతో సమావేశమై వారి అంచనాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే సింహపురి ఎలక్ట్రికల్ బస్ డిపోనకు సంబంధించి డిపో మేనేజర్, ఎలక్ట్రికల్

... మిగతా 6వ పేజీలో



ఫైల్‌ఫొటో

నిర్వహణ వ్యయం, కాలుష్యం తగ్గించేందుకు...

నిర్వహణ వ్యయం, నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ-బస్సులు వినియోగం అవసరం. ఫ్యూయల్‌తో నడిచే బస్సుల నిర్వాహణ వ్యయం కంటే ఈ-బస్సుల నిర్వహణ వ్యయం చాలా తక్కువ. నగరంలో వాహన కాలుష్యం అధికంగా ఉన్న కారణంగా ఎలక్ట్రిక్ బస్సుల అవసరాన్ని ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి నివేదించాం. స్మార్ట్ సిటీ స్థాయికి తగ్గట్టు బస్సులు ఉండాలన్న ఉద్దేశంతో ఎలక్ట్రిక్ బస్సుల ప్రతిపాదన చేశాం. ఆ మేరకు ఆర్టీసీ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వం స్పందించింది. త్వరలో నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి.

- బి.అప్పలనాయుడు, రీజనల్ మేనేజర్, విశాఖ రీజియన్



టికెట్ల లెక్కలపై విజిలెన్స్

చందనోత్సవం కోసం ఎన్ని ముద్రించారు?, ఎవరికి ఇచ్చారనే వివరాలు సేకరణ

- వైసీపీ కార్యకర్తకు రూ.వేయి టికెట్లు 63 జారీ
- సేవా సంస్థల పేరుతో 400 వెహికల్ పాస్‌లు తీసుకున్న దేవస్థానం అధికారులు
- 40 పంపిణీ చేసి మిగిలినవి అమ్ముకున్న సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం చందనోత్సవం జరిగి వారం రోజులు దాటిన తరువాత కూడా దేవస్థానం అధికారులు చేసిన తప్పిదాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఉత్సవంలో ఏడుగురు భక్తులు మరణించిన నేపథ్యంలో ప్రభుత్వం ఇక్కడ జరిగిన వ్యవహారాలపై అన్ని కోణాల్లోను వివరాలు సేకరిస్తోంది. అందులో ప్రధానంగా టికెట్ల ముద్రణ, పంపిణీ, విక్రయాల వ్యవహారం చాలా వివాదాస్పదమైంది. ఉత్సవం బుధవారం జరుగుతుండగా మంగళవారం రాత్రి వరకూ ఎవరికీ టికెట్లు ఇవ్వలేదు. ఆ రోజు రాత్రి 11.30 గంటల వరకూ టిక్కెట్లు ముద్రిస్తూనే ఉన్నారు. పంచుతూనే ఉన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల మనుషులు కూడా ఈఓ కార్యాలయం ముందు పడిగాపులు కాశారు. ఎప్పుడూ ఇలా జరగలేదని ఈసారి దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ వారికి నచ్చినట్టు వ్యవహరించారని వారు విజయవాడలో ఫిర్యాదు చేశారు. దాంతో టికెట్ల లెక్కలపై విజిలెన్స్‌తో పాటు ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం సేకరిస్తున్నారు.



చందనోత్సవానికి క్యూలో భక్తులు (ఫైల్‌ఫొటో)

వైసీపీ కార్యకర్తకు అన్ని టిక్కెట్లా..?

దాతలకు కూడా ఈసారి టికెట్లు సరిగా ఇవ్వలేదు. సింహాచలంలో ఉండే వైసీపీ కార్యకర్త కశిరెడ్డి కాశీకి మాత్రం ఈఓ కార్యాలయం రెండు స్లాట్ల ద్వారా వేయి రూపాయల టికెట్లు 63 మంజూరుచేసినట్టు అధికారుల

... మిగతా 6వ పేజీలో

సింహాచలం ప్రమాదంపై ముగ్గురికి సస్పెన్షన్ నోటీసులు

ఇంకో నలుగురికి అందని ఉత్తర్వులు

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలం చందనోత్సవం సందర్భంగా జరిగిన ప్రమాదంలో ఏడుగురు భక్తులు మరణించిన ఘటనకు సంబంధించి సస్పెండైన అధికారుల్లో ముగ్గురికి మాత్రమే గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగిలిన నలుగురికి ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదు. ప్రమాదం ఏప్రిల్ 30వ తేదీన జరగ్గా ఆరోజే ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. ఆ కమిటీ మూడు రోజులు విచారణ చేసి నివేదికను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సమర్పించింది. అదే రోజు ఈ ఘటనకు ఏడుగురు అధికారులను బాధ్యులుగా పేర్కొంటూ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ముగ్గురిపై క్రిమినల్

... మిగతా 6వ పేజీలో

పోలీస్ అధికారిణిపై సీపీకి ఫిర్యాదుల వెల్లువ

- అంతర్గత విచారణకు ఆదేశించినట్టు సమాచారం

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక అధికారిణిపై సీపీ శంఖబ్రతబాగ్చికి పలువురు బాధితులు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిసింది. తన భర్తతో కలిసి జీవించేలా చర్యలు తీసుకోవాలని కోరితే, విడాకులు తీసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చారని బాధితురాలు ఒకరు నేరుగా ఇప్పటికే సీపీ శంఖబ్రతబాగ్చికి ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో సదరు అధికారి చేతిలో తాము కూడా అదేతరహా అనుభవం ఎదుర్కొన్నామంటూ పలువురు సీపీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో సదరు పోలీస్ అధికారి తీరుపై అంతర్గత విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని నార్త్‌సబ్‌డివిజన్ ఏసీపీ అప్పలరాజును సీపీ ఆదేశించినట్టు సమాచారం.

పాడి రైతుల నెత్తిన పాలు

సరఫరాలో స్వేచ్ఛ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

- ఏ డెయిరీ ఎక్కువ రేటు ఇస్తే ఆ డెయిరీకి ఇచ్చుకోవచ్చు
- అమూల్‌కు మాత్రమే పాలు పోయాలన్న నిబంధన తొలగింపు
- కొత్తగా మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటు
- తొలిదశలో జిల్లాకు 15 సంఘాలు
- రూ.1.5 లక్షల విలువైన కిట్లు సరఫరా
- డీసీసీబీ ద్వారా పాడి రైతులకు రుణాలు



మహిళా పాల సహకార సంఘాలకు అందజేయనున్న పరికరాలు



విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): పాల సరఫరాలో రైతులకు స్వేచ్ఛ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన 'అమూల్'కు మాత్రమే పాలు పోయాలన్న నిబంధనను తొలగించింది. ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికి సరఫరా చేసుకునేలా ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో తొలివిడత కొత్తగా 15 మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ సంఘాల ఏర్పాటు నుంచి నిర్వహణ, పాల సేకరణ, రైతులకు శిక్షణ, రుణాల మంజూరు

... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ పరారీ

ఆరిలోవ, మే 8 (ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీ ఒకరు పోలీసుల కళ్లుగప్పి పరారైనట్టు విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన నామాల నాగరాజు గత నెల విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీలో గల ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. అతడిని పట్టుకోవడానికి పోలీసులు విజయవాడ వెళ్లారు. పోలీసులను గమనించిన నాగరాజు తప్పించుకునే క్రమంలో రెండంతస్థుల మేడ పైనుంచి దూకాడు. దీంతో వెన్నుపూసకు గాయాలయ్యాయి. కదలలేని స్థితిలో ఉన్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని తొలుత చికిత్స అందించి, అనంతరం ఏప్రిల్ 13న కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నాగరాజుకు రిమాండ్ విధించింది. అయితే తీవ్ర గాయాలపాలైన అతడిని పోలీసులు కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ ప్రిజన్ సెల్‌లో ఉంచి ఏప్రిల్ 19 నుంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు గురువారం శస్త్రచికిత్స చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 7:30 గంటల సమయంలో టిఫిన్ చేయడానికి చేతికి ఉన్న బేడీలను విధుల్లో ఉన్న ఏఆర్ పోలీసులు తొలగించారు. కొంతసేపటి తర్వాత పోలీసులు కళ్లుగప్పి నాగరాజు అక్కడ నుంచి అదృశ్యమైనట్టు ఏఆర్ సిబ్బంది తన దృష్టికి తెచ్చినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా, 16 రోజుల క్రితం ఇదేవిధంగా కోర్టు నుంచి వస్తున్న ఒక రిమాండ్ ఖైదీ పారిపోయాడు. అతడి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. తాజాగా ఇప్పుడు మరో రిమాండ్ ఖైదీ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకోవడం విస్మయం కలిగిస్తోంది.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ తులసీ దళార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ తులసీ దళంతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

'ఉపాధి కూలీలకు కనీస సదుపాయాలు కల్పించాలి'

పద్మనాభం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి పనులు జరుగుతున్న చోట కూలీలకు కనీస సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి పనులు జరిగే చోట నిలువ నీడ లేక, తాగునీటి సౌకర్యం లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు తక్షణమే స్పందించి వేతనదారులకు తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

ఆక్రమణలు తొలగింపు

భీమునిపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో వార్డు కె. నగరపాలెంలో ఆక్రమణలను అధికారులు గురువారం తొలగించారు. ఆ గ్రామంలో వున్న వుడా అప్రూవ్డ్ ప్రైవేట్ లేఅవుట్‌లో సుమారు ఇరవై సెంట్లుకు పైగా స్థలాన్ని పార్క్, భవిష్యత్ అవసరాలకు మినహాయించారు. దీన్ని నగరానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి, చుట్టూ ఫెన్సింగ్, గేటు, లోపల ఒక చిన్న షెడ్డు నిర్మించారు. దీనిపై ఆ గ్రామ టీడీపీ నాయకుడు పోతిన అప్పలరాజు ఆధ్వర్యంలో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ భీమిలి జోనల్ అధికారులు, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ ఆక్రమణలను తొలగించారు.

సచివాలయాలు తనిఖీ

పద్మనాభం, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి, రేవిడి సచివాలయాలను ఎంపీడీఓ ఎం. విజయ్‌కుమార్ గురువారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అప్పగించిన సర్వేల పురోగతిని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం చేయరాదని ఆయన సూచించారు.

సిటీ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు

... 5వ పేజీ తరువాయి

ఇంజనీరింగ్ అధికారులు, గ్యారేజీ అధికారులతో కొద్దిరోజుల క్రితం సమావేశమయ్యారు. త్వరలో ఈ రెండు ప్రాంతాలకు విద్యుత్, ట్రాన్స్‌ఫార్మర్లు, చార్జింగ్ ఎక్విప్‌మెంట్ వంటి సమకూరుస్తామని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. రెండో విడతలో మధురవాడ డిపోను ఈ-బస్సుల డిపోగా మారుస్తామని ప్రకటించారు. మొదటి విడతగా విశాఖ రీజియన్‌కు వచ్చిన ఈ-బస్సులను గాజువాక, సింహాచలం డిపోలు కేంద్రాలుగా నగరంలోని ప్రధాన రహదారుల్లో నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు తయారుచేశారు. సింహాచలం నుంచి ద్వారకా కాంప్లెక్సు, పాత పోస్టాఫీస్, ఆర్కే బీచ్, సింధియా ప్రాంతాలకు, గాజువాక నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్కే బీచ్, సింహాచలం, పెందుర్తి ప్రాంతాలకు నడిపేందుకు నిర్ణయించారు. రెండో దశలో రానున్న ఈ-బస్సులను ఇతర రూట్లలో నడిపేందుకు నిర్ణయించారు.

అనంత పద్మనాభునికి జలాధివాసం



ఆలయం చుట్టూ విమాన శిఖరం ప్రదక్షిణ

పద్మనాభం, మే 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ మహా సంప్రోక్షణ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గురువారం అనంతునికి, విమాన శిఖరానికి జలంతో అభిషేకం చేసి జలాధివాసం వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు విమాన శిఖరాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించి ఆలయంలోకి తీసుకువెళ్లారు. పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, జలాధివాసం,అధివాస హోమం, అష్టాక్షరీ మహా మంత్ర హోమం, ప్రభూత బలి ప్రదానం, శయనాధివాసం, హౌత్రం మహా శాంతి హోమం, సర్వ దైవశ్చ హోమం, ధాన్యాధివాసం, పాయస హోమం, రాత్రి పూర్ణ కుంభం పూజ నిర్వహించారు. అనంతరం పిల్లలు లేని దంపతులకు పాయసాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నానాజీబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు నగేశ్‌కుమార్, సత్యనారాయణ, నారాయణరావు, ఎర్నాయుడు, పద్దు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ శిఖర ప్రతిష్ఠ

అనంత పద్మనాభుని ఆలయ శిఖర ప్రతిష్ఠ శుక్రవారం జరగనుంది. నాలుగు రోజులుగా వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. ఆఖరి ఘట్టమైన శిఖర ప్రతిష్ఠలో భాగంగా ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహం, అగ్నిధ్యానం, ఉక్తహోమం తదితర కార్యక్రమాల అనంతరం విమాన శిఖర ప్రతిష్ఠ, కళావాహన, ప్రథమార్చన, గోదర్శనం, శాంతి కల్యాణం, ప్రసాద వితరణ చేపడతారు. ఈ కార్యక్రమానికి భీమిలి,విజయనగరం ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పూసపాటి అతిథి విజయలక్ష్మి ముఖ్యఅతిధులుగా హాజరుకానున్నారు.

రెండో రోజు 45 కిలోల చందనం అరగదీత



చందనం అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి) : చందనం అరగదీత గురువారం కూడా కొనసాగింది. అప్పన్న స్వామికి వైశాఖ పూర్ణిమ అనగా ఈనెల 12న తెల్లవారుజామున మూడు మణుగుల (125 కిలోల) చందనం సమర్పించనున్న విషయం తెలిసిందే. ఈమేరకు వేకువజామున సుప్రభాతసేవ ప్రభాతారాధనలు తరువాత ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజల చేసి, ఉదయం 7 నుంచి సుమారు ఐదు గంటల పాటు చందనాన్ని అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనాన్ని ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేయగా 45 కిలోలు వచ్చింది. దాన్ని ఆలయ బాండాగారంలో భద్రపరిచారు.

మైనింగ్ పేరుతో పర్యావరణ విధ్వంసం



కొండ ప్రాంతంలో గనుల తవ్వకాలు వద్దని నినాదాలు చేస్తున్న గిరిజనులు

ఆనందపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : క్వార్ట్జైట్ వెలికితీత పేరుతో కొండలను, పర్యావరణాన్ని ధ్వంసం చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గిరిజనులతో కలిసి దెయ్యాలమెట్ట కొండను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వార్ట్ జైట్ గనుల నిక్షేపాలు వెలికితీతకు రాష్ట్ర ప్రభుత్వం అగ్నిసముఖ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 15 ఎకరాల కొండ భూములను 20 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి ప్రయత్నిస్తోందని, తక్షణమే దీన్ని విరమించుకోవాలన్నారు. కొండ భూముల్లో గిరిజనులు వరి, కొబ్బరి, మామిడి, జీడి, అరటి, మునగ వంటి పంటలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని, మైనింగ్ వల్ల వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని ప్రజలు జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వన్యప్రాణులకు హాని కలగడంతో పాటు భూగర్భ జలాలు, గాలి కలుషితమై రోగాల ప్రభలే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ స్పందించి, మైనింగ్ అనుమతులను రద్దు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాంబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈమేరకు ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కలిగొట్ల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రం 7 నుంచి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొలుత పుణ్యాహవాచనం, ఉత్సవాంగీకరణ, రక్షా బంధనం, యాగశాల ప్రవేశం జరుగుతాయి .శనివారం ఉదయం యాగశాలార్చన, ధ్వజారోహణ, గరుడ ప్రసాద వితరణ జరుగుతుంది. సాయంత్రం నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యం, అన్నమాచార్య సంకీర్తనలతో అష్టోత్తర శత నృత్య సంగీతార్చన జరుగుతాయి. 11న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, సాయంత్రం శ్రీకృష్ణ తులాభారం, ఐశ్వర్య కోలాటం బృందంతో కోలోటోత్సవం, భరత నాట్యం జరుగుతాయి. 12న శ్రీవారి ఉత్సవ మూర్తులకు అలంకార తిరుమంజనసేవ, సాయంత్రం శ్రీవారి సప్తమ వార్షిక తిరు కల్యాణ మహోత్సవం, అన్నమాచార్య సంకీర్తనలు జరుగుతాయి. 13న సుదర్శన హోమం, ఐశ్వర్య లక్ష్మీ హోమం, సాయంత్రం శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తారు. 14న కొట్నాల ఉత్సవం, వసంతోత్సవం, శ్రీవారి ధృవమూర్తికి నవకలశస్నపనం, శ్రీచక్ర స్నానం, మధ్యాహ్నం అన్నకూటోత్సవం జరుగుతాయి. సాయంత్రం శ్రీ పుష్పయాగం, శ్రీకృష్ణ కూచిపూడి నృత్య నిలయం వారితో సాంస్కృతిక కార్యక్రమాలు, మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద గోష్ఠితో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

సింహాచలం ప్రమాదంపై ముగ్గురికి సస్పెన్షన్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

చర్యలకు కూడా సిఫారసు చేశారు. అయితే మూడు రోజుల తరువాత గురువారం సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ కె.సుబ్బారావు, ఏపీటీడీసీలో పనిచేస్తున్న ఈఈ కె.రమణ, డీఈ ఏఆర్‌వీఎల్‌ఆర్ స్వామిలకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ (విశాఖపట్నం) దాటి బయటకు వెళ్లవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన నలుగురు ఇంజనీర్లకు ఇంకా ఉత్తర్వులు అందలేదు. వీరిలో దేవస్థానానికి చెందిన ఇంజనీర్లు డీజీ శ్రీనివాసరాజు (ఈఈ), కేఎస్ఎన్ మూర్తి(డిప్యూటీ ఈఈ), కె.బాబ్జీ(జేఈ)లతో పాటు ఏపీటీడీసీకి చెందిన పి.మదన్‌మోహన్(ఏఈ) ఉన్నారు. కాగా సింహాచలం దేవస్థానం ఇంజనీరింగ్ విభాగంలో చాలామంది అర్హతలు లేకుండా ఇంజనీర్లుగా కొనసాగుతున్నారని, మరికొందరు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతులు పొందారంటూ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులే రెండేళ్ల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై గత దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పలువురు ఇంజనీరింగ్ ఉద్యోగులకు నోటీసులు జారీ చేసి, వివరణ కోరారు. ఇప్పటివరకూ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. ఇంజనీరింగ్ విభాగం అంతా గందరగోళంగా ఉందని, అర్హతలు లేనివారు కొనసాగుతున్నారని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు లేవని ప్రభుత్వం గుర్తించడంతో ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

నైట్ ఫుడ్ కోర్టుపై పిల్లిమొగ్గలు

... 5వ పేజీ తరువాయి

తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం ఫుడ్‌కోర్ట్‌లో 170కి పైగా దుకాణాలు ఉన్నాయి. నలుగురైదుగురు వ్యక్తులు పదేసి దుకాణాలను ఏర్పాటు చేసి, వాటిని అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. దుకాణదారుల నుంచి ప్రతిరోజూ రూ.300 నుంచి రూ.500 వసూలు చేసి ఫుడ్‌కోర్టుకు అండదండలు అందించిన నేతలకు, సంబంధిత కార్పొరేటర్లకు వాటాలు ఇచ్చే బాధ్యతను ఒక వ్యాపారి తీసుకున్నారు. జీవీఎంసీకి ఫుడ్‌కోర్ట్ వల్ల ఒక్క రూపాయి ఆదాయం రాకపోయినా సరే పారిశుధ్య సిబ్బందితోనే అక్కడ పనులు చేయించేవారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పెద్దఎత్తున ఆరోపణలు గుప్పించారు. జీవీఎంసీకి ఆదాయం రాని అనధికార ఫుడ్‌కోర్ట్‌ను అక్కడి నుంచి తొలగించాలంటూ కౌన్సిల్ సమావేశంలో ఆందోళన చేసేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఫుడ్‌కోర్ట్‌ను అక్కడి నుంచి తొలగించాలని నిర్ణయిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. తర్వాత దీనిని అమలు చేయకుండా తాత్సారం చేయడంతో టీడీపీ, జనసేన కార్పొరేటర్లు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఫుడ్‌కోర్ట్‌ను పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో వారం తర్వాత అక్కడే ధర్నాకు దిగుతామంటూ అల్టిమేటం జారీచేశారు. దీంతో అధికారులు ఫుడ్‌కోర్ట్‌ను అక్కడి నుంచి తొలగించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఫుడ్‌కోర్ట్‌ను తొలగించేందుకు అధికారులు సన్నద్ధం కాగా ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లకు వాటాలుగా పంచే బాధ్యత చూస్తున్న దళారి రంగంలోకి దిగాడు. కూటమిలో కొందరు ప్రజాప్రతినిధులతోపాటు కార్పొరేటర్లలో కీలకంగా వ్యవహరిస్తున్న వారిని ప్రసన్నం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో ఫుడ్‌కోర్ట్ తొలగింపు విషయంలో తొందరపడొద్దంటూ అధికారులకు ఆదేశాలు అందాయి. ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని చాలాకాలంగా పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు వెనక్కి తగ్గితే విమర్శలు ఎదుర్కొనాల్సి వస్తుందని కూటమిలో కొంతమంది కార్పొరేటర్లు అంటున్నారు. మేయర్ పీఠం కైవసం చేసుకున్న తర్వాత గత పాలకవర్గం చేసిన తప్పిదాలను సరిదిద్దడం ద్వారా ప్రజల్లో గుర్తింపు సంపాదించుకోవాల్సిన సమయంలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని ఫుడ్‌కోర్ట్ తొలగింపునకు అడ్డుపడుతున్న కార్పొరేటర్లకు చెబుతున్నారు. ఫుడ్ కోర్టులో ప్రస్తుతం ఉన్న దుకాణాలను తొలగించాలని, అవసరమైతే తిరిగి అదేచోట జీవీఎంసీకి ఆదాయం వచ్చేలా అర్హులైన వారికి డ్రా లేదా వేలం ద్వారా దుకాణాలను కేటాయించాలని సూచిస్తున్నారు. కూటమి కార్పొరేటర్లలోనే భిన్న వాదనలు మొదలవ్వడంతో ఫుడ్ కోర్ట్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారని ఆసక్తిగా మారింది.

టికెట్ల లెక్కలపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

దృష్టికి వెళ్లింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలకే అన్ని టికెట్లు ఇవ్వనప్పుడు ప్రతిపక్ష పార్టీ కార్యకర్తకు ఎలా ఇచ్చారని ఆరా తీస్తున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో టికెట్లు తీసుకున్న వారి వివరాలు కూడా పరిశీలిస్తున్నారు.

వెహికల్ పాస్‌లు అమ్ముకున్నారు

అంతకు ముందు ఏడాది ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయిపోయి భక్తులు కాలినడకన రాకపోకలు సాగించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొండపైకి పరిమితంగా అంటే కేవలం 150 వాహనాలను మాత్రమే అనుమతిస్తామని పోలీస్ కమిషనర్ ప్రకటించారు. ఆ విధంగానే ఎవరికీ వెహికల్ పాస్‌లు ఇవ్వలేదు. అయితే దేవస్థానం అధికారులు మాత్రం కొండపై సేవలు అందించే సంస్థలు ఉన్నాయని, వారు ప్రసాదాలు, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తాయని వాటికి పాస్‌లు అవసరమని 400 తీసుకున్నారు. వాటిలో కేవలం 40 పాస్‌లు స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇచ్చి, మిగిలిన పాస్‌లను, అడ్డగోలుగా దక్కించుకున్న వేయి రూపాయలు, రూ.1,500 టికెట్లను కొందరు అధికారులు అధిక ధరలకు అమ్ముకొని జేబులు నింపుకొన్నారు. ఈ విషయం ఇప్పటివరకూ ఎక్కడా బయటకు పొక్కలేదు. దేవస్థానం ఉద్యోగులు కొందరు వేయి రూపాయల టికెట్లు ఒక్కొక్కటి రూ.2 వేలు చొప్పున అమ్ముకున్నారని తెలిసింది గానీ వెహికల్ పాస్‌లు అమ్ముకున్న విషయం బయటకు రాలేదు.

కప్ప స్తంభం ఆదాయం రూ.7.8 లక్షలు

సింహాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి కప్పస్తంభం ఆలింగనాల ద్వారా గత నెలలో రూ.7.8లక్షల ఆదాయం సమకూరింది. కప్పస్తంభం ఆలింగనం టికెటు రూ.25లను నెల మొత్తం మీద 31,229 మంది భక్తులు కొనుగోలు చేయగా అప్పన్న ఖజానాకు రూ.7,80,725లు ఆదాయం వచ్చింది.

యోగాతో ఆరోగ్యం

సింహాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ యోగా సాధకుడు కె. సన్యాసిరావు అన్నారు. గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఆయన మాట్లాడారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

భీమునిపట్నం,మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతుత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

వీఐపీల భద్రతలో అప్రమత్తం : సీపీ



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు వ్యక్తిగత భద్రత అధికారులు (పీఎస్ఓ)గా పనిచేసేవారికి సమయస్ఫూర్తి తప్పనిసరి అని సీపీ శంఖబ్రత బాగ్చి అన్నారు. నగర పోలీస్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో పీఎస్ఓలుగా పనిచేస్తున్న 69 మందికి వృత్తి నైపుణ్యం పెంచేందుకు వీలుగా రెండు రోజులు నిర్వహించిన క్యాప్సూల్స్ కోర్సు శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ నుంచి ఇద్దరు అనుభవజ్ఞులైన అధికారులు వచ్చి విషయాలను పీఎస్ఓలకు తెలియజేశారన్నారు. రెండు రోజుల కోర్సులో నేర్చుకున్న అంశాలు ప్రతీ పీఎస్ఓకి విధి నిర్వహణలో మరింత సమర్థంగా పనిచేసేందుకు తోడ్పడతాయనడంలో అనుమానం లేదన్నారు. వీవీటీ, రోడ్ షో, బహిరంగసభలు, రోడ్డు ప్రయాణాలు, ఇతర ప్రయాణాల సమయంలో ప్రముఖుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాంబ్ డిటెక్షన్,డిస్పోజింగ్, ఫుడ్‌సేఫ్టీ, ఫైర్‌సేఫ్టీ, ఎస్‌ఐటీ, డ్రోన్, ఫస్ట్ ఎయిడ్‌తోపాటు అత్యవసర సమయాల్లో వీఐపీల భద్రతకు చాకచక్యంగా తీసుకోవాల్సిన చర్యలపై మరింత అవగాహన పెంచుకునే అవకాశం పీఎస్ఓలకు లభించిందన్నారు. వీఐపీల భద్రత విషయంలో నిరంతరం తెలివిగా వ్యవహరించాలని, అన్ని కోణాల్లోనూ భద్రతను అంచనా వేయాలని సూచించారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్

మధురవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని మిథిలాపురి వుడా కాలనీ రోడ్డు సినీ పోలీస్ ఎదురుగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నగర పోలీసులు అందించిన సమాచారం మేరకు సినీపోలీస్‌మాల్ ఎదురుగా కొందరు యువకులు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆ శిబిరంపై పోలీసులు దాడి చేశారు. అక్కడ విజయనగరానికి చెందిన గంది రామునాయుడు, గంది సింహాద్రి అలియాస్ భోగేశ్‌లు బెట్టింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వారి వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, మూడు స్మార్ట్‌మొబైల్ ఫోన్లు, మూడు కీపాడ్‌లు స్వాధీనం చేసుకున్నారు. ల్యాప్‌టాప్‌ను పరిశీలించగా అందులో అవతార్ అనే పేరుతో ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసి ఉంది. దాని ద్వారానే క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. బెట్టింగ్ యాప్‌లు నిర్వహించినా, అందుకు సహకరించినా నేరమని, ఇలాంటి వాటికి యువత దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

సెల్‌ఫోన్ చోరీ..

7వ వార్డు పరిధిలోని మిథిలాపురి వుడాకాలనీలో బుధవారం రాత్రి సిటీబస్సు ఎక్కుతుండగా సెల్‌ఫోన్ చోరీ చేశారని బాధితుడు హరికుమార్ తెలిపారు. హరి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హైదరాబాద్ వెళ్లేందుకు నగరంలోని రైల్వేస్టేషన్‌కు చేరుకోడానికి వుడా కాలనీలో సిటీబస్సు ఎక్కుతుండగా తన సెల్‌ఫోన్‌ను తస్కరించారని తెలిపాడు. నెలరోజుల కిందటే సెల్‌ఫోన్ కొనుగోలు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

మానసిక వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సీతంపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : భర్తను కాదని మరో యువకుడ్ని ప్రేమించి వివాహం చేసుకున్న ఓ మహిళ చివరకు వేధింపులకు గురై మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడింది. ద్వారకా పోలీసుల వివరాలు ప్రకారం... శ్రీకాకుళం జిల్లా టెక్కలి రంగాపురానికి చెందిన ఎల్.శ్రావణికి 2022లో బి.మాధవరావుతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది.శ్రావణి చదువుతానని చెప్పడంతో నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల్లో భర్త చేర్పించాడు. కళాశాల్లో చదువుతున్న సమయంలో కొమర రోహిత్ కుమార్ ఆమెకు పరిచయమై వారి మధ్య ప్రేమకు దారితీసింది. దీంతో శ్రావణి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి మాధవరావుతో ఇకపై ఉండనని, రోహిత్‌కుమార్‌ను వివాహం చేసుకుంటానని తెలిపింది. ఈ క్రమంలో మాధవరావుకు విడాకులిచ్చింది. అనంతరం రోహిత్‌కుమార్, శ్రావణి కుటుంబాల అంగీకారంతో వారికి రిజిస్టర్ వివాహం జరిగింది. ఇద్దరూ కొద్ది రోజులు హైదరాబాద్‌లో ఉండి అనంతరం విశాఖపట్నం వచ్చి కాపురం పెట్టారు. శ్రావణిని ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న ఒక హాస్టల్‌లో రోహిత్ కుమార్ ఉంచాడు. వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. శ్రావణి తనతో కలిసి ఉండమని కోరినప్పుడు రోహిత్ దురుసుగా వ్యవహరించేవాడు. అద్దె చెల్లించే ఆర్థిక స్థోమత తనకు లేదని, కలిసి జీవించాలంటే తన ఖర్చులు తానే భరించాలని శ్రావణిని వేధించేవాడు.అంతేకాకుండా ఆమెను వివాహం చేసుకున్నందుకు చింతిస్తున్నానని, నువ్వు చనిపోతే తాను సంతోషంగా ఉంటానని రోహిత్ కుమార్ మాటలతో వేధించాడు. దీంతో విరక్తి చెందిన శ్రావణి బుధవారం క్రిమిసంహారక మందు తాగింది. హాస్టల్‌లో ఉన్నవారు చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేందర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పేదల బియ్యం పక్కదారి

కైలాసపురం 46వ నంబర్ రేషన్ డిపోలో వెలుగు చూసిన బాగోతం

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి) : కైలాసపురంలో రేషన్ డిపో నంబరు 46 నుంచి రెండున్నర టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్టు పౌర సరఫరాల అధికారులు గుర్తించారు. డిపోకు ప్రతి నెల 13.3 టన్నులు బియ్యం సరఫరా అవుతుంది. డిపో ఒరిజినల్ డీలర్ సౌజన్యపై గతంలో 6-ఎ కేసు నమోదు కావడంతో సమీపంలో మరో డీలర్ అప్పలసన్యాసినాయుడుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన డయాలసిస్ పేషెంట్ కావడంతో 6-ఎ కేసు నమోదైన ఒరిజినల్ డీలర్ సౌజన్యకు డిపోను అనధికారికంగా అప్పగించారు. నిబంధనల మేరకు కేసు నమోదైన వ్యక్తికి డిపో ఇవ్వకూడదు. కానీ అనారోగ్యకారణాలతో డిపోను తాత్కాలికంగా పర్యవేక్షించాలని కోరారు. అయితే రెండు రోజుల క్రితం డిపో నుంచి రెండున్నర టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్టు పౌరసరఫరాల అధికారులకు స్థానికులు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో సర్కిల్-2 సహాయ పౌరసరఫరాల శాఖ అధికారి కల్యాణి, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు కైలాసపురంలో డిపో వద్దకు వెళ్లి ఇన్‌చార్జి డీలరు అప్పల సన్యాసినాయుడుకు కబురుపెట్టారు. అయితే డిపో తాళాలు పాత డీలరు వద్ద ఉన్నాయని చెప్పడంతో ఆమెకు సమాచారం ఇచ్చారు. అయినా ఆమె రాకపోవడంతో డిపో షట్టర్ విరగ్గొట్టి లోపల ఉన్న స్టాకు వివరాలు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలతో స్టాకు సరిపోల్చారు. రెండున్నర టన్నులు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీలరు నుంచి వివరాలు సేకరించారు. తనకు ఆరోగ్యం సహకరించకపోవడంతో పాత డీలర్‌ను చూడాలని కోరారని స్టేట్‌మెంట్ ఇచ్చారు. గతంలో ఇదే డిపో నుంచి బియ్యం పక్కదారి పట్టడంతో నమోదుచేసిన కేసు ఇంకా పెండింగ్‌లో ఉంది. చివరకు ఇన్‌చార్జి డిపో డీలరుపై 6-ఎ కేసు నమోదు చేశారు.

పాడి రైతుల నెత్తిన పాలు

... 5వ పేజీ తరువాయి

తదితర అంశాలను ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య (ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్) పర్యవేక్షించనున్నది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డెయిరీలను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీని తీసుకువచ్చింది.అమూల్ డెయిరీ ప్రైవేటు సంస్థ అయినప్పటికీ ప్రతి జిల్లాలో ఉపాధి హామీ నిధులతో పాల సేకరణ కేంద్రాలు, ప్రధానమైనచోట్ల పాల శీతలీకరణ సెంటర్లు ఏర్పాటుచేసింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు అమూల్ కోసం పనిచేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి అమూల్‌కు పాలు పోసే రైతులకు రుణాలు మంజూరుచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా ఉండే డెయిరీల కంటే అమూల్ ప్రయోజనాలకు పెద్దపీట వేయడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అమూల్ డెయిరీ విషయంలో అధికారులపై ఒత్తిడి తగ్గింది. గ్రామీణ మహిళలకు సాధికారిత కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కొత్తగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి జిల్లాలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా విశాఖ జిల్లాలో తొలివిడతలో 15 సంఘాలు ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటివరకూ జెర్రిపోతులపాలెం, మజ్జిపేట, దాకమర్రిలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. మిగిలిన 12 సంఘాలు నెలాఖరు నాటికి స్థాపించనున్నారు. ప్రతి సంఘానికి కార్యదర్శి, ప్రమోటర్, కో-ప్రమోటర్‌తోపాటు మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంతకంటే ఎక్కువ సభ్యులను చేర్చుకునే అవకాశం ఇచ్చారు. సభ్యులంతా పాడి పశువులు ఉన్నవారు వారై ఉండాలి. పాలు ఫలానా డెయిరీకి సరఫరా చేయాలన్న నిబంధనను ప్రభుత్వం తొలగించింది. ఎక్కువ రేటు ఇచ్చే డెయిరీకి పాలు సరఫరా చేసుకునే స్వేచ్ఛ సంఘానికి ఉంటుంది. సంఘం నిర్వహణ, పాల సేకరణ, పాల నాణ్యత, ఇత్యాది అంశాల కోసం ప్రతి సంఘానికి ప్రభుత్వం రూ.1.5 లక్షల విలువైన కంప్యూటర్, ప్రింటర్, యూపీఎస్, ఎనలైజర్, వెన్న శాతం కొలిచే పరికరం, తూకపు యంత్రం, డిస్‌ప్లే బోర్డు తదితర పరికరాలు సరఫరా చేస్తుంది. సంఘం నిర్వహణకు ప్రతి లీటరుకు కొద్దిమొత్తం సంబంధిత డెయిరీ చెల్లించాలని నిబంధన పెట్టారు. పాలుపోసే రైతులకు డీసీసీబీ బ్యాంకుల్లో ఖాతాలు ఓపెన్ చేస్తారు. డెయిరీ నుంచి పాల సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. పాల సేకరణ ప్రారంభం తరువాత పశువులకు దాణా కోసం ప్రతి రైతుకు రూ.50 వేల వరకు రుణాలు ఇవ్వనున్నారు. కాగా అన్ని జిల్లాల్లో 1964 సహకార సంఘాల చట్టం నిబంధనల మేరకు మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ప్రతినిధి రాకేష్ తెలిపారు. సంఘాల ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతుందని, త్వరలో పాల సేకరణ ప్రారంభిస్తామన్నారు. ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండే డెయిరీలకు రైతులు పాలు విక్రయించవచ్చునని చెప్పారు.

నిరుద్యోగుల శ్రమ దోపిడీదారు జగన్‌రెడ్డి

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల శ్రమను మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దోచేశారని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఆరోపించారు. ఏళ్ల తరబడి ఎదురు చూసే అసలైన నిరుద్యోగులను అక్రమాలు, అవినీతితో జగన్ ప్రభుత్వం ముంచేసిందని గురువారం ఒక ప్రకటన ద్వారా దుయ్యబట్టారు. నిరుద్యోగ యువత ఆశలను చిదిమేశారని, లక్షలాది కుటుంబాల జీవితాలను కుదిపేసిన పాలకుడని అభివర్ణించారు. కనీసం ఒక్క పరీక్ష కూడా పారదర్శకంగా నిర్వహించలేని అసమర్థ వైసీపీ ప్రభుత్వమని, అటువంటి పాలకులు ఇప్పుడు సుస్థిర పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వంపై దుమారం రేపడం హాస్యాస్పదమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్‌కు సూర్యనారాయణ



విశాఖపట్నం స్పోర్ట్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన కంచరాన సూర్యనారాయణ ను టెక్నికల్ అఫీషియల్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బిహార్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి సూర్యనారాయణ న్యాయ నిపుణుడిగా వ్యవహరిస్తారు.

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ రిఫరీ అర్హత కలిగిన సూర్యనారాయణ అనేక అంతర్జాతీయ, జాతీయ టోర్నీలకు రిఫరీగా వ్యవహరించడమే కాకుండా భారత్ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షునిగా, ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

రాయితీపై పశువుల దాణా

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పశువులు పెంచే రైతులకు 50 శాతం రాయితీపై దాణా సరఫరా చేస్తామని పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి సంయుక్త సంచాలకుడు డాక్టరు కరుణాకర్ తెలిపారు. 50 కిలోల బ్యాగ్‌తో ఉన్న దాణా రూ.1110లు కాగా, రూ.550లకు అందజేస్తామన్నారు. ప్రతినెలా 150 కిలోల వంతున మూడు నెలల దాణా అందజేస్తామన్నారు. రైతుల కోసం జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల దాణా వచ్చిందన్నారు. బియ్యంకార్డు కలిగిన రైతుకు రెండు పశువులు, ఒక దూడ ఉంటే రైతుసేవాకేంద్రం, పశువైద్యశాలలో వైద్యుడ్ని సంప్రదించాలన్నారు. వేసవి కాలంలో పశుగ్రాసం కొరత ఉండడంతో పశువులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రాయితీపై ఇచ్చే దాణా ఉపయోగపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సినిమా గైడ్

● సింగిల్ : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● శుభం: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● హిట్ : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 46, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 46, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 34, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 40, కంద 80, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించండి

యూసీడీ అధికారులకు నగర మేయర్ సూచన



యూసీడీ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలో అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు జీవీఎంసీ యూసీడీ విభాగం సిబ్బంది సకాలంలో అందించాలని, మహిళల ఆర్థిక పురోగతికి సహకరిస్తూ చిత్తశుద్ధితో అధికారులు విధులను నిర్వహించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) సత్యవేణి, ఇతర యూసీడీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తోందని, అయితే వాటిని సక్రమంగా అర్హులైన వారికి అందించడం ఉద్యోగుల బాధ్యత అన్నారు. అప్పుడే ప్రభుత్వానికి, జీవీఎంసీకి మంచి పేరుతో పాటు మంచి పాలన అందించేందుకు అవకా శం ఉంటుందన్నారు. నగరంలో ఏయే కేటగిరిల్లో ఎన్ని ఫించన్లు పంపిణీ చేస్తున్నారనే విషయమై ఆరా తీశారు. నైట్ షెల్టర్లను రాత్రి 11 గంటల తర్వాత అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. నగరంలో ఉన్న 25 అన్న క్యాంటీన్లను అధికారులు సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలని, నైట్ షెల్టర్లతో పాటు అన్న క్యాంటీన్లను ఆకస్మికంగా తాను తనిఖీలు నిర్వహిస్తానని అన్నారు. అన్న క్యాంటీన్లో భోజనం చేసి నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానన్నారు. నగరంలో నిర్మించిన టిడ్కో గృహాల్లో అనర్హులు ఉన్నారని, చాలా చోట్ల టిడ్కో గృహాలు ఖాళీగా ఉన్నాయని, మొత్తం టిడ్కో గృహాల జాబితా వాటి వివరాలు అందించాలని ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. కొంతమంది ఆర్పీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రజలకు మంచి సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని యూసీడీ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు అధికారులు డి.లక్ష్మి, సూర్యకళ, డీపీవోలు హనుమంతు శంకర్, సురేష్, డిప్యూటీ తహసీల్దారు నాగలక్ష్మి, ఏపీడీలు ఇతర యూసీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరాభివృద్దే ధ్యేయంగా పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం 3వ జోన్ 15వ వార్డుపరిధిలోని కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో పలు రక్షణ గోడల నిర్మాణానికి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి సహకరిస్తున్నారని, విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు పలు కంపెనీలు నగరంలో నెలకొల్పుతున్నాయని తెలిపారు. వెంకోజీపాలెం కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు చాలా అవసరం ఉన్నందున కార్పొరేటర్ సూచనల మేరకు రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో పలు కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ రక్షణ గోడల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-3 కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్, సచివాలయం కార్యదర్శులు, టీడీపీ నాయకులు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి,వరలక్ష్మి, పార్వతి, సోని, గ్రామ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా పోలమాంబ అమ్మవారు



మద్దిలపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు. అయిదు, రెండు, వంద, యాభై రూపాయల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం కృష్ణుడు ఆలయం వద్ద నిర్వహించిన 'రేలారే రేలా..'సాంస్కృతిక కార్యక్రమం ఉర్రూతలూగించింది. ఈ వేడుకల్లో సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి చెల్లిబోయిన సునీల్‌కుమార్, కార్యదర్శులు మువ్వల మౌళి, ఎం.హరిప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

గెడ్డ పూడిక తీసేందుకు దారి కోసం నర్సరీ స్థలం పరిశీలన

ఎంవీపీ కాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలోని వీఎమ్మార్డీఏ నర్సరీ వెనుక స్థలాన్ని మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం పరిశీలించారు. ఓ గెడ్డలో పూడిక తొలగించేందుకు వీలు లేనందున, సమీపంలోని కొంత ప్రాంతాన్ని కేటాయిస్తే, అక్కడ నుంచి ఎక్స్‌కవేటర్ ద్వారా పనులు చేయించడానికి వీలవుతుందని, ఈ మేరకు ఎంవీపీలోని వుడా నర్సరీలో కొంత స్థలం కేటాయించాలని కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలారావు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను కొద్ది రోజుల క్రితం కోరారు. హనుమంతువాక మీదుగా ఎంవీపీ రెండు, ఆరు, ఏడు, ఎనిమిది సెక్టర్ల నుంచి వాసవానిపాలెం వద్ద సముద్రంలో కలిసే గెడ్డ ప్రవాహానికి ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరు వద్ద గెడ్డలో పూడిక పేరుకుపోతోంది. దీనివల్ల ఆ పక్కన ఉన్న స్కీమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి దుర్గంధం వెదజల్లడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కడకు ఎక్స్‌కవేటర్ తీసుకెళ్లి శుభ్రం చేయడానికి అనువుగా లేదు. గెడ్డను ఆనుకుని వీఎమ్మార్డీఏ నర్సరీ ఉంది. నర్సరీలోకి ఎక్స్‌కవేటర్ ప్రవేశించే అవకాశం కల్పిస్తే అక్కడి నుంచి గెడ్డను శుభ్రం చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి కొంత స్థలాన్ని కేటాయిస్తే, ఎక్స్‌కవేటర్, లారీలు వెళ్లేందుకు వీలుగా ర్యాంప్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే, ఎప్పటికప్పుడు గెడ్డ పూడిక తొలగించడానికి అవకాశం ఉంటుంది.

ఈ మేరకు వీఎమ్మార్డీఏ అధికారులతో స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడి పరిస్థితిని కమిషనర్‌కు నివేదించి, తగిన చర్యలు తీసుకుంటామని వీఎమ్మార్డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ తెలిపారు.

20న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

మద్దిలపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమ్మెలో భాగంగా జిల్లాలో ఈనెల 20న చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పి.వెంకట్రావు, డి.అప్పలరాజులు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం సీపీఎం కార్యాలయంలో గురువారం వారు జాతీయ సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కార్మికవర్గం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం దారుణమన్నారు. కార్మికులకు నష్టదాయకమైన ఆ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వ రంగంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, అసంఘటిత, సంఘటిత రంగాల్లో ఈ నెల 20 న చేపట్టబోయే జాతీయ సమ్మెపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 20న సమ్మెలో భాగంగా రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ బొమ్మ వరకు ర్యాలీ అనంతరం సభ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, సింహాచలం, లక్ష్మణరావు, వెంకటరావు పాల్గొన్నారు.

కరాచీవాలా ఇక్కడివారే

» బీజేపీ నగర అధ్యక్షుడు మంతెన పరశురామరాజు స్పష్టీకరణ

» కరాచీవాలా నేమ్‌బోర్డుపై మూసివేసిన పేపర్స్‌ను తొలగించిన నాయకులు



కరాచీ అన్న పదంపై మూసేసిన పేపరును తొలగిస్తున్న బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామ్‌రాజు

సిరిపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): కరాచీవాలా డిపార్ట్‌మెంటల్ స్టోర్ యజమానులు భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని బీజేపీ నగర అధ్యక్షుడు మంతెన పరశురామరాజు తెలియజేశారు. సిరిపురం దత్ ఐలాండ్ వద్ద కరాచీవాలా డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌ను తొలగించాలని ఇటీవల నిరసన వ్యక్తం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో నేమ్‌బోర్డుపై మూసేసిన పేపర్స్‌ను స్వయంగా పరశురామరాజు తొలగించారు. ఆయన మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు సింధు నది పరివాహక తీరంలోని కరాచీ అనే ప్రాంతంలో వీరంతా నివసించేవారన్నారు. అక్కడి నుంచి వీరు విశాఖకు వలస వచ్చి స్థిరపడి కరాచీవాలా పేరుతో డిపార్ట్‌మెంటల్ స్టోర్‌ను నడుపుకుంటున్నారన్నారు. పాకిస్థాన్‌కు, వీరికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఇటీవల కాలంలో కరాచీ స్టోర్స్‌పై జరిగిన దాడికి బీజేపీ, భారతీయ యువ మోర్చాకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నానన్నారు. ఇదే విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటివాటికి బీజేపీ దూరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధోని నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిలీప్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ సాయిసుదర్శన్, కాటూరి రవీంద్ర, ఎం.శంకర్, వై.రవికుమార్, జి.రోహిత్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం పునఃప్రారంభం



కళ్యాణమండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

ఎంవీపీ కాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పదిహేడో వార్డు పరిధిలోని ఎంవీపీ ఒకటో సెక్టరులో శిథిలావస్థలో ఉన్న వీఎమ్మార్డీఏ కల్యాణమండపం ఇటీవల రూ.40 లక్షలతో ఆధునీకీకరించారు. దీన్ని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు నియోజకవర్గం శాశనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ చేతుల మీదుగా గురువారం ప్రారం భించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటరు గేదెల లావణ్య, బోలిశెట్టి సత్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏయూ లైబ్రరీని సందర్శించిన ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు ఏయూ గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాలకు గ్రంథాలయాలు ఉపయుక్తంగా ఉండాలన్నారు. గ్రంథాలయాల వల్ల జ్ఞానప్రసరణ జరుగుతుందని, దీనివల్ల సమాజానికి ఎంతో మేలు సమకూరుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలో గల తాళపత్ర గ్రంథాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



ఏయూను సందర్శించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావుతో గ్రంథాలయ సిబ్బంది

అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్



సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని శివాజీపాలెం, కేఆర్ఎం కాలనీ ప్రాంతంలోని అనారోగ్యానికి గురైన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం అందించారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శివాజీపాలెం ప్రాంతానికి చెందిన లేబురు గిరిబాబుకు రూ.20 వేలు, కేఆర్ఎం కాలనీకి చెందిన సింహాద్రి నాగమణికి రూ.20,524లు మంజూరు కాగా, ఆ పత్రాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బీచ్ రోడ్డు, మే 8 (ఆంధ్రజ్యోతి) : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పోర్టు పూల్ కలాసీలు గురువారం దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలాసీలు మాట్లాడుతూ విశాఖ పోర్టులో గత 30 సంవత్సరాలుగా పూల్ కలాసీలుగా పని చేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో బతుకులు నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందిస్తూ.. పోర్టు చైర్మన్‌తో పాటు కేంద్ర మంత్రి దృష్టికి వీలైనంత త్వరగా సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కలాసీలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోర్టు పూల్ కలాసీలు యూనియన్ నాయకులు వాసుపల్లి రాము,శంకర్, ఖలీషా, శ్రీనివాస్, భీమారావు, పి.హరి తదితరులు పాల్గొన్నారు.

యథాస్థానంలో జిమ్ పరికరాల ఏర్పాటు

పార్కులో తొలగింపుపై వ్యతిరేకతతో అధికారుల దిద్దుబాటు చర్యలు



తొలగించిన జిమ్ పరికరాలు యథా స్థానంలో ఏర్పాటు చేసిన జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని పిఠాపురం కాలనీ పార్కులో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించిన జిమ్ పరికరాలను గురువారం మళ్లీ వారే యథా స్థానంలో ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జీవీఎంసీ పార్కులోని జిమ్, క్రీడా పరికరాలు తొలిగించడం వివాదమైంది. పిఠాపురం కాలనీ పార్కులో అక్రమ నిర్మాణాలు, అక్రమ వ్యాపారాలు తొలగించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. దీంతో పార్కులోని అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలు తొలగించాలని జిల్లా కలక్టర్ ఆదేశించడంతో బుధవారం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పార్కు వద్దకు వచ్చారు. పార్కులో ఎలాంటి నిర్మాణాలు, వ్యాపారాలు కనిపించకపోయేసరికి ఫిర్యాదు చేసిన కార్పొరేటర్‌కు ఫోన్ చేసి ఇక్కడ నిర్మాణాలేవి లేవని చెప్పగా, పార్కులో క్రీడాపరికరాలు, కళావేదికే అక్రమ నిర్మాణాలని, అవే తొలగించాలని చెప్పడంతో ఖంగుతిన్నారు. చేసేది లేక జిమ్ పరికరాలు, ఆటవస్తువులు పెకిలించారు. అయితే దీనిపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. అధికారులు, కార్పొరేటర్ తీరుపై స్థానికులు నిరసన తెలిపారు. ఈ విషయం రచ్చ కావడంతో పార్కులో తొలగించిన క్రీడా సామగ్రి, వ్యాయామ పరికరాలను యథాస్థానంలో ఏర్పాటు చేశారు.

వికసించిన మే పుష్పం



ఆరిలోవ, మే 8 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలిలోని కొండవాలు ప్రాంతంలో ఉన్న ఈశ్వరదేవినగర్‌లో ఒక ఇంటి పెరటిలో మే పుష్పం వికసించింది. ఈ పుష్పం మే నెల మొదటివారంలో మాత్రమే వికసిస్తుందని ఇంటి వారు తెలిపారు.. సుమారు నాలుగు సంవత్సరాల నుంచి ఈ పుష్పం మే నెలలో మాత్రమే వికసిస్తుందని వారు తెలి పారు. దాదాపు ఏడు రోజుల వరకు ఉంటుందని తెలిపారు. దీని నుంచి మంచి పరిమళం వెదజల్లుతోంది. ఈ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

చర్లపల్లి-బ్రహ్మపూర్ మధ్య నేటి నుంచి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ మీదుగా చర్లపల్లి-బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07027 నంబరు గల రైలు ఈ నెల 9 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.25 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 2.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07028 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.43 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 11.35 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు.

మ్యూజికల్ ఫౌంటెన్ పునఃప్రారంభం

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ సెంట్రల్ పార్కులో గతకొంతకాలంగా నిలిచిపోయిన మ్యూజికల్ ఫౌంటెన్ పునఃప్రారంభమయ్యింది. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ గురువారం దీన్ని పునఃప్రారంభించారు. నూతన పాటలతో రూపొందించిన ఈ ఫౌంటెన్ విశాఖ సెంట్రల్ పార్కుకు వచ్చే సందర్శకులకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ వెల్లడించారు. దీనివల్ల పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన కలెక్టర్, డీఆర్వో

- రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా
- 150 మంది అధికారులు, సిబ్బంది రక్తదానం


కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఆర్ఓ భవానీశంకర్‌ల రక్తదానం

మహారాణిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన కనిపించింది. గురువారం రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలోనూ, జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలోనూ రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ సహా పలువురు అధికారులు రక్తదానం చేశారు. రక్తదానం ఆవశ్యకతను తెలియజేస్తూ స్వయంగా కలెక్టర్ రక్తదానం చేయడంతో ఆయన స్ఫూర్తితో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రెడ్‌క్రాస్ బృందం కలిపి సుమారు 150 మంది రక్తదానం చేశారు. డీఆర్వో భవానీశంకర్ సైతం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఐపీల భద్రతలో పీఎస్‌ఓలకు సమయస్ఫూర్తి తప్పనిసరి: సీపీ



ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు వ్యక్తిగత భద్రత అధికారులు(పీఎస్ఓ)గా పనిచేసేవారికి సమయస్ఫూర్తి తప్పనిసరి అని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. నగర పోలీస్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో పీఎస్ఓలుగా పనిచేస్తున్న 69 మందికి వృత్తినైపుణ్యం పెంచేందుకు వీలుగా రెండు రోజులు నిర్వహించిన క్యాప్సూల్ కోర్సు శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ నుంచి ఇద్దరు అనుభవజ్ఞులైన అధికారులు వచ్చి విషయాలను పీఎస్ఓలకు తెలియజేశారన్నారు. రెండు రోజుల కోర్సులో నేర్చుకున్న అంశాలు ప్రతీ పీఎస్ఓకి విధి నిర్వహణలో మరింత సమర్థంగా పనిచేసేందుకు తోడ్పడతాయనడంలో అనుమానం లేదన్నారు. పీపీటీ, రోడ్ షో, బహిరంగసభలు, రోడ్డు ప్రయాణాలు, ఇతర ప్రయాణాల సమయంలో ప్రముఖుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాంబ్ డిటెక్షన్ డిస్పోజింగ్, ఫుడ్‌సేఫ్టీ, ఫైర్‌సేఫ్టీ, ఎస్ఐబీ, డ్రోన్, ఫస్ట్ ఎయిడ్‌తోపాటు అత్యవసర సమయాల్లో వీఐపీల భద్రతకు చాకచక్యంగా తీసుకోవాల్సిన చర్యలపై మరింత అవగాహన పెంచుకునే అవకాశం పీఎస్ఓలకు లభించిందన్నారు. వీఐపీల భద్రత విషయంలో నిరంతరం తెలివిగా వ్యవహరించాలని, అన్ని కోణాల్లోనూ భద్రతను అంచనా వేయాలని సూచించారు.

నైట్ ఫుడ్ కోర్టుపై పిల్లిమొగ్గలు

... 5వ పేజీ తరువాయి

తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం ఫుడ్‌కోర్టులో 170కి పైగా దుకాణాలు ఉన్నాయి. నలుగురైదుగురు వ్యక్తులు పదేసి దుకాణాలను ఏర్పాటు చేసి, వాటిని అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. దుకాణదారుల నుంచి ప్రతిరోజూ రూ.300 నుంచి రూ.500 వసూలు చేసి ఫుడ్‌కోర్టుకు అండదండలు అందించిన నేతలకు, సంబంధిత కార్పొరేటర్లకు వాటాలు ఇచ్చే బాధ్యతను ఒక వ్యాపారి తీసుకున్నారు. జీవీఎంసీకి ఫుడ్‌కోర్టు వల్ల ఒక్క రూపాయి ఆదాయం రాకపోయినా సరే పారిశుధ్య సిబ్బందితోనే అక్కడ పనులు చేయించేవారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పెద్దఎత్తున ఆరోపణలు గుప్పించారు. జీవీఎంసీకి ఆదాయం రాని అనధికార ఫుడ్‌కోర్టును అక్కడి నుంచి తొలగించాలంటూ కౌన్సిల్ సమావేశంలో ఆందోళన చేసేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఫుడ్‌కోర్టును అక్కడి నుంచి తొలగించాలని నిర్ణయిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. తర్వాత దీనిని అమలు చేయకుండా తాత్సారం చేయడంతో టీడీపీ, జనసేన కార్పొరేటర్లు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఫుడ్‌కోర్టును పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో వారం తర్వాత అక్కడే ధర్నాకు దిగుతామంటూ అల్టిమేటం జారీచేశారు. దీంతో అధికారులు ఫుడ్‌కోర్టును అక్కడి నుంచి తొలగించేందుకు కసరత్తు ప్రారంభించారు.

ఫుడ్‌కోర్టును తొలగించేందుకు అధికారులు సన్నద్ధం కాగా ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లకు వాటాలుగా పంచే బాధ్యత చూస్తున్న దళారి రంగంలోకి దిగాడు. కూటమిలో కొందరు ప్రజాప్రతినిధులతోపాటు కార్పొరేటర్లలో కీలకంగా వ్యవహరిస్తున్న వారిని ప్రసన్నం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో ఫుడ్‌కోర్టు తొలగింపు విషయంలో తొందరపడొద్దంటూ అధికారులకు ఆదేశాలు అందాయి. ఫుడ్‌కోర్టును తొలగించాలని చాలాకాలంగా పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు వెనక్కి తగ్గితే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని కూటమిలో కొంతమంది కార్పొరేటర్లు అంటున్నారు. మేయర్ పీఠం కైవసం చేసుకున్న తర్వాత గత పాలకవర్గం చేసిన తప్పిదాలను సరిదిద్దడం ద్వారా ప్రజల్లో గుర్తింపు సంపాదించుకోవాల్సిన సమయంలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని ఫుడ్‌కోర్టు తొలగింపునకు అడ్డుపడుతున్న కార్పొరేటర్లకు చెబుతున్నారు. ఫుడ్ కోర్టులో ప్రస్తుతం ఉన్న దుకాణాలను తొలగించాలని, అవసరమైతే తిరిగి అదేచోట జీవీఎంసీకి ఆదాయం వచ్చేలా అర్హులైన వారికి డ్రా లేదా వేలం ద్వారా దుకాణాలను కేటాయించాలని సూచిస్తున్నారు. కూటమి కార్పొరేటర్లలోనే భిన్న వాదనలు మొదలవ్వడంతో ఫుడ్ కోర్టుపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారని ఆసక్తిగా మారింది.

సిటీ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు

... 5వ పేజీ తరువాయి

ఇంజనీరింగ్ అధికారులు, గ్యారేజీ అధికారులతో కొద్దిరోజుల క్రితం సమావేశమయ్యారు. త్వరలో ఈ రెండు ప్రాంతాలకు విద్యుత్, ట్రాన్స్‌ఫార్మర్లు, చార్జింగ్ ఎక్విప్‌మెంట్ వంటి సమకూరుస్తామని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. రెండో విడతలో మధురవాడ డిపోను ఈ-బస్సుల డిపోగా మారుస్తామని ప్రకటించారు. మొదటి విడతగా విశాఖ రీజియన్‌కు వచ్చిన ఈ-బస్సులను గాజువాక, సింహాచలం డిపోలు కేంద్రాలుగా నగరంలోని ప్రధాన రహదారుల్లో నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు తయారుచేశారు. సింహాచలం నుంచి ద్వారకా కాంప్లెక్సు, పాత పోస్టాఫీస్, ఆర్‌కే బీచ్, సింధియా ప్రాంతాలకు, గాజువాక నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్కే బీచ్, సింహాచలం, పెందుర్తి ప్రాంతాలకు నడిపేందుకు నిర్ణయించారు. రెండో దశలో రానున్న ఈ-బస్సులను ఇతర రూట్లలో నడిపేందుకు నిర్ణయించారు.

సింహాచలం ప్రమాదంపై ముగ్గురికి సస్పెన్షన్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

చర్యలకు కూడా సిఫారసు చేశారు. అయితే మూడు రోజుల తరువాత గురువారం సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈఈ కె.సుబ్బారావు, ఏపీటీడీసీలో పనిచేస్తున్న ఈఈ కె.రమణ, డీఈ ఏఆర్‌వీఎల్‌ఆర్ స్వామిలకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ (విశాఖపట్నం) దాటి బయటకు వెళ్లవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన నలుగురు ఇంజనీర్లకు ఇంకా ఉత్తర్వులు అందలేదు. వీరిలో దేవస్థానానికి చెందిన ఇంజనీర్లు డీజీ శ్రీనివాసరాజు (ఈఈ), కేఎస్ఎన్ మూర్తి(డీప్యూటీ ఈఈ), కె.బాబ్జీ(జేఈ)లతోపాటు ఏపీటీడీసీకి చెందిన పి.మదన్‌మోహన్(ఏఈ) ఉన్నారు.

వారిపై విచారణ ఏదీ...?

సింహాచలం దేవస్థానం ఇంజనీరింగ్ విభాగంలో చాలామంది అర్హతలు లేకుండా ఇంజనీర్లుగా కొనసాగుతున్నారని, మరికొందరు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతులు పొందారంటూ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులే రెండేళ్ల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై గత దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పలువురు ఇంజనీరింగ్ ఉద్యోగులకు నోటీసులు జారీ చేసి, వివరణ కోరారు. ఇప్పటివరకూ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. ఇంజనీరింగ్ విభాగం అంతా గందరగోళంగా ఉందని, అర్హతలు లేనివారు కొనసాగుతున్నారని, నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు లేవని ప్రభుత్వమే గుర్తించిన నేపథ్యంలో ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఇప్పటికైనా తప్పు చేసిన వారిని రక్షించే కార్యక్రమాలకు స్వస్తి పలికి తగిన చర్యలు తీసుకోవలసి ఉంది.

మానసిక వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సీతంపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): తాళికట్టిన భర్తను కాదని మరో యువకుడిని ప్రేమించి వివాహం చేసుకున్న ఓ మహిళ చివరకు వేధింపులకు గురై మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడింది. విశాఖపట్నంలోని ద్వారకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శ్రీకాకుళం జిల్లా టెక్కలి రంగాపురానికి చెందిన ఎల్.శ్రావణికి 2022లో బి.మాధవరావుతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. అయితే శ్రావణి చదువుతానని చెప్పడంతో నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆమెను భర్త చేర్పించాడు. కళాశాల్లో చదువుతున్న సమయంలో కొమర రోహిత్‌కుమార్ ఆమెకు పరిచయం కావడం వారి మధ్య ప్రేమకు దారితీసింది. దీంతో శ్రావణి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి మాధవరావుతో ఇకపై ఉండనని, రోహిత్‌కుమార్‌ని వివాహం చేసుకుంటానని తెలిపింది. ఈ క్రమంలో మాధవరావుకు విడాకులిచ్చింది. అనంతరం రోహిత్‌కుమార్, శ్రావణి కుటుంబాల అంగీకారంతో వీరికి రిజిస్టర్ వివాహం జరిగింది. ఇద్దరూ కొద్ది రోజులు హైదరాబాద్‌లో ఉండి అనంతరం విశాఖపట్నం వచ్చి కాపురం పెట్టారు. శ్రావణిని ద్వారకా పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఒక హాస్టల్‌లో రోహిత్‌కుమార్ ఉంచాడు. వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. శ్రావణి తనతో కలిసి ఉండమని కోరినప్పుడు రోహిత్ దురుసుగా వ్యవహరించేవాడు. అద్దె చెల్లించే ఆర్థిక స్థోమత తనకు లేదని, కలిసి జీవించాలంటే తన ఖర్చులు తానే భరించాలని శ్రావణిని వేధించేవాడు. అంతేకాకుండా ఆమెను వివాహం చేసుకున్నందుకు చింతిస్తున్నానని, నువ్వు చనిపోతే తాను సంతోషంగా ఉంటానని రోహిత్‌కుమార్ మాటలతో వేధించాడు. దీంతో విరక్తి చెందిన శ్రావణి బుధవారం క్రిమిసంహారక మందు తాగింది. హాస్టల్‌లో ఉన్నవారు చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసుస్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పేదల బియ్యం పక్కదారి

- కైలాసపురం 46వ నంబర్ రేషన్ డిపోలో వెలుగుచూసిన బాగోతం
- పర్యవేక్షిస్తున్న డీలర్ రాకపోవడంతో షట్టర్ విరగ్గొట్టి స్టాకు వివరాలు నమోదు

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): కైలాసపురంలో రేషన్ డిపో నంబరు 46 నుంచి రెండున్నర టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్టు పౌర సరఫరాల అధికారులు గుర్తించారు. డిపోకు ప్రతి నెల 13.3 టన్నులు బియ్యం సరఫరా అవుతుంది. డిపో ఒరిజినల్ డీలర్ సౌజన్యపై గతంలో 6-ఎ కేసు నమోదు కావడంతో సమీపంలో మరో డీలర్ అప్పలసన్యాసినాయుడుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన డయాలసిస్ పేషెంట్ కావడంతో 6-ఎ కేసు నమోదైన ఒరిజినల్ డీలర్ సౌజన్యకు డిపోను అనధికారికంగా అప్పగించారు. నిబంధనల మేరకు కేసు నమోదైన వ్యక్తికి డిపో ఇవ్వకూడదు. కానీ అనారోగ్యకారణాలతో డిపోను తాత్కాలికంగా పర్యవేక్షించాలని కోరారు. రెండు రోజుల క్రితం డిపో నుంచి రెండున్నర టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్టు పౌరసరఫరాల అధికారులకు స్థానికులు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో సర్కిల్-2 సహాయ పౌరసరఫరాల శాఖ అధికారి కల్యాణి, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు కైలాసపురంలో డిపో వద్దకు వెళ్లి ఇన్‌చార్జి డీలరు అప్పల సన్యాసినాయుడుకు కబురుపెట్టారు. అయితే డిపో తాళాలు పాత డీలరు వద్ద ఉన్నాయని చెప్పడంతో ఆమెకు సమాచారం ఇచ్చారు. అయినా ఆమె రాకపోవడంతో డిపో షట్టర్ విరగ్గొట్టి లోపల ఉన్న స్టాకు వివరాలు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలతో స్టాకు సరిపోల్చారు. రెండున్నర టన్నులు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీలరు నుంచి వివరాలు సేకరించారు. తనకు ఆరోగ్యం సహకరించకపోవడంతో పాత డీలర్‌ను చూడాలని కోరారని స్టేట్‌మెంట్ ఇచ్చారు. గతంలో ఇదే డిపో నుంచి బియ్యం పక్కదారి పట్టడంతో నమోదుచేసిన కేసు ఇంకా పెండింగ్‌లో ఉంది. చివరకు ఇన్‌చార్జి డిపో డీలరుపై 6-ఎ కేసు నమోదుచేశారు.

రైలు ప్రయాణికుల దాహార్తి తీర్చిన సేవాబృందం


ఉక్కునగరంలోని శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

అక్కయ్యపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుల దాహార్తి తీర్చారు శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు. వేసవిలో దూర ప్రయాణాలు చేసే వారి దాహం తీర్చాలని దువ్వాడ రైల్వే స్టేషన్ వారు ఉక్కునగరంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి జెంట్స్ సేవాదళ్ వారిని అభ్యర్థించారు. దీంతో దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులోని రిజర్వేషన్ ప్రయాణికులకు, జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ఉన్నవారికి మొత్తం 600 నీళ్ల సీసాలను అందించారు. ఈ సేవా కార్యక్రమంలో ఉక్కు నగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, జాయింట్ కన్వీనర్ ఎస్‌కెఆర్‌కె రాజు, పైడినాయుడు, అగనంపూడి భజన మండలి కన్వీనర్ జి.వి. ప్రసాద్, కర్రి శ్రీనివాస్, సన్యాసిరాజు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు. వీరి సేవలను పలువురు అభినందించారు.

విశాఖలో క్రీడాభివృద్ధికి పూర్తి సహకారం : శాప్ చైర్మన్ రవినాయుడు


క్రీడా సామగ్రి కిట్లను అందజేస్తున్న కలెక్టర్ హరింధరప్రసాద్, 'శాప్' చైర్మన్ రవినాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తదితరులు

మహారాణిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో అన్ని రకాల క్రీడల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాభివృద్ధి సంస్థ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరిప్రసాద్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు, పలువురు క్రీడా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ క్రీడల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం వివిధ క్రీడా సంఘాల సమన్వయం ఎంతో కీలకమన్నారు. విశాఖలో క్రీడాభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ వేసవిలో శాప్ ద్వారా 50 వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు క్రీడా అకాడమీల ఏర్పాటుకు కృషి చేయనున్నట్టు తెలిపారు అనంతరం అధికారులతో కలిసి వేసవి క్రీడా శిబిరాల క్రీడా సామాగ్రి కిట్లును అందించారు.

భక్తిశ్రద్ధలతో ప్రసన్నవెంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అల్లిపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురం వెంకటేశ్వరమెట్ట బల్లగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ఆరాధన, నివేదన, విశేష హోమాలు, మంగళాశాసనం చేశారు. ఉదయం ధ్వజారోహణం, మధ్యాహ్నం రాజబోగం నివేదన జరిపారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆలయ ఈవో రమాబాయి పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవాన్ని ఆలయ అర్చకులు గొడవర్తి రఘునాథాచార్యులు, వేద పండితులు, మేళతాళాల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహోత్సవం కల్యాణ ఘట్టం మొత్తం భక్తులను పరవశింప జేసింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టికెట్ల లెక్కలపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

దృష్టికి వెళ్లింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలకే అన్ని టికెట్లు ఇవ్వనప్పుడు ప్రతిపక్ష పార్టీ కార్యకర్తకు ఎలా ఇచ్చారని ఆరా తీస్తున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో టికెట్లు తీసుకున్న వారి వివరాలు కూడా పరిశీలిస్తున్నారు.

వెహికల్ పాస్‌లు అమ్ముకున్నారు

అంతకు ముందు ఏడాది ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయిపోయి భక్తులు కాలినడకన రాకపోకలు సాగించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొండపైకి పరిమితంగా అంటే కేవలం 150 వాహనాలను మాత్రమే అనుమతిస్తామని పోలీస్ కమిషనర్ ప్రకటించారు. ఆ విధంగానే ఎవరికీ వెహికల్ పాస్‌లు ఇవ్వలేదు. అయితే దేవస్థానం అధికారులు మాత్రం కొండపై సేవలు అందించే సంస్థలు ఉన్నాయని, వారు ప్రసాదాలు, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తాయని వాటికి పాస్‌లు అవసరమని 400 తీసుకున్నారు. వాటిలో కేవలం 40 పాస్‌లు స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇచ్చి, మిగిలిన పాస్‌లను, అడ్డగోలుగా దక్కించుకున్న వేయి రూపాయలు, రూ.1,500 టికెట్లను కొందరు అధికారులు అధిక ధరలకు అమ్ముకొని జేబులు నింపుకొన్నారు. ఈ విషయం ఇప్పటివరకూ ఎక్కడా బయటకు పొక్కలేదు. దేవస్థానం ఉద్యోగులు కొందరు వేయి రూపాయల టికెట్లు ఒక్కొక్కటి రూ2 వేలు చొప్పున అమ్ముకున్నారని తెలిసింది గానీ వెహికల్ పాస్‌లు అమ్ముకున్న విషయం బయటకు రాలేదు. దీనిపై కూడా విచారణ చేస్తే కొండపై దొంగలు ఎవరో రంగు బయటపడుతుంది.

పాడి రైతుల నెత్తిన పాలు

... 5వ పేజీ తరువాయి

తదితర అంశాలను ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య (ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్) పర్యవేక్షించనున్నది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డెయిరీలను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీని తీసుకువచ్చింది. అమూల్ డెయిరీ ప్రైవేటు సంస్థ అయినప్పటికీ ప్రతి జిల్లాలో ఉపాధి హామీ నిధులతో పాల సేకరణ కేంద్రాలు, ప్రధానమైనచోట్ల పాల శీతలీకరణ సెంటర్లు ఏర్పాటుచేసింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు అమూల్ కోసం పనిచేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి అమూల్‌కు పాలు పోసే రైతులకు రుణాలు మంజూరుచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా ఉండే డెయిరీల కంటే అమూల్ ప్రయోజనాలకు పెద్దపీట వేయడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అమూల్ డెయిరీ విషయంలో అధికారులపై ఒత్తిడి తగ్గింది. గ్రామీణ మహిళలకు సాధికారిత కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కొత్తగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి జిల్లాలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా విశాఖ జిల్లాలో తొలివిడతలో 15 సంఘాలు ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటివరకూ జెర్రిపోతులపాలెం, మజ్జిపేట, దాకమర్రిలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. మిగిలిన 12 సంఘాలు నెలాఖరు నాటికి స్థాపించనున్నారు. ప్రతి సంఘానికి కార్యదర్శి, ప్రమోటర్, కో-ప్రమోటర్‌తోపాటు మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంతకంటే ఎక్కువ సభ్యులను చేర్చుకునే అవకాశం ఇచ్చారు. సభ్యులంతా పాడి పశువులు ఉన్నవారు వారై ఉండాలి. పాలు ఫలానా డెయిరీకి సరఫరా చేయాలన్న నిబంధనను ప్రభుత్వం తొలగించింది. ఎక్కువ రేటు ఇచ్చే డెయిరీకి పాలు సరఫరా చేసుకునే స్వేచ్ఛ సంఘానికి ఉంటుంది. సంఘం నిర్వహణ, పాల సేకరణ, పాల నాణ్యత, ఇత్యాది అంశాల కోసం ప్రతి సంఘానికి ప్రభుత్వం రూ.1.5 లక్షల విలువైన కంప్యూటర్, ప్రింటర్, యూపీఎస్, ఎనలైజర్, వెన్న శాతం కొలిచే పరికరం, తూకపు యంత్రం, డిస్‌ప్లే బోర్డు తదితర పరికరాలు సరఫరా చేస్తుంది. సంఘం నిర్వహణకు ప్రతి లీటరుకు కొద్దిమొత్తం సంబంధిత డెయిరీ చెల్లించాలని నిబంధన పెట్టారు. పాలుపోసే రైతులకు డీసీసీబీ బ్యాంకుల్లో ఖాతాలు ఓపెన్ చేస్తారు. డెయిరీ నుంచి పాల సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. పాల సేకరణ ప్రారంభం తరువాత పశువులకు దాణా కోసం ప్రతి రైతుకు రూ.50 వేల వరకు రుణాలు ఇవ్వనున్నారు. కాగా అన్ని జిల్లాల్లో 1964 సహకార సంఘాల చట్టం నిబంధనల మేరకు మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ప్రతినిధి రాకేష్ తెలిపారు. సంఘాల ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతుందని, త్వరలో పాల సేకరణ ప్రారంభిస్తామన్నారు. ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండే డెయిరీలకు రైతులు పాలు విక్రయించవచ్చునని, ఈ విషయంలో ఎటువంటి ఒత్తిడి, షరతులు లేవన్నారు.

పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు


ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న పోలీసులు

డాబాగార్డెన్స్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎర్రంనాయుడు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్, డీసీపీ ఆదేశాల మేరకు గురువారం రాత్రి టూ టౌన్ పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్స్, కల్లుపాకలు, చావులమదుం తదితర ప్రాంతాల్లోని బృందాలుగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రస్తుతం వేరే ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారితో పాటుగా నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. గంజాయి, డ్రగ్స్, మారణాయుధాలు గానీ అక్రమ రవాణా నిలిపివేసేందుకు క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని కొన్ని బస్సులతో పాటు ఇతరత్రా వాహనాలల్లో విస్తృత తనిఖీలు పట్టామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు సతీష్, సింహాచలం, మన్మథరావు, పోలీసులు పాల్గొన్నారు.

'దీపం' ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ


లబ్ధిదారుకు గ్యాస్ సిలిండరు అందజేస్తున్న ఎమ్మెల్యే

మహారాణిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : దీపం పథకం-2లో భాగంగా ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేపట్టారు. గురువారం జీవీఎంసీ 29వ వార్డులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సూపర్ 6 పథకంలో ఒకటైన ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేపట్టామన్నారు. సిలిండర్ బుక్ చేసిన 48 గంటల్లోనే రాయితీ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మన్యాల శ్రీనివాస్ అంగటి శ్రావణ కుమార్, బుద్ధల అనురాధతో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల శ్రమ దోపిడీదారు జగన్‌రెడ్డి

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల శ్రమను మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దోచేశారని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఆరోపించారు. ఏళ్ల తరబడి ఎదురు చూసే అసలైన నిరుద్యోగులను అక్రమాలు, అవినీతితో జగన్ ప్రభుత్వం ముంచేసిందని గురువారం ఒక ప్రకటన ద్వారా దుయ్యబట్టారు. నిరుద్యోగ యువత ఆశలను చిదిమేశారని, లక్షలాది కుటుంబాల జీవితాలను కుదిపేసిన పాలకుడని అభివర్ణించారు. కనీసం ఒక్క పరీక్ష కూడా పారదర్శకంగా నిర్వహించలేని అసమర్థ వైసీపీ ప్రభుత్వమని, అటువంటి పాలకులు ఇప్పుడు సుస్థిర పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వంపై దుమారం రేపడం హాస్యాస్పదమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్‌కు సూర్యనారాయణ



విశాఖపట్నం స్పోర్ట్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన కంచరాన సూర్యనారాయణ ను టెక్నికల్ అఫీషియల్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బీహార్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి సూర్యనారాయణ న్యాయ నిపుణుడిగా వ్యవహరిస్తారు.

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ రిఫరీ అర్హత కలిగిన సూర్యనారాయణ అనేక అంతర్జాతీయ, జాతీయ టోర్నీలకు రిఫరీగా వ్యవహరించడమే కాకుండా భారత్ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షునిగా, ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

రాయితీపై పశువుల దాణా

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పశువులు పెంచే రైతులకు 50 శాతం రాయితీపై దాణా సరఫరా చేస్తామని పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి సంయుక్త సంచాలకుడు డాక్టరు కరుణాకర్ తెలిపారు. 50 కిలోల బ్యాగ్‌తో ఉన్న దాణా రూ.1110లు కాగా, రూ.550లకు అందజేస్తామన్నారు. ప్రతినెలా 150 కిలోల వంతున మూడు నెలల దాణా అందజేస్తామన్నారు. రైతుల కోసం జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల దాణా వచ్చిందన్నారు. బియ్యంకార్డు కలిగిన రైతుకు రెండు పశువులు, ఒక దూడ ఉంటే రైతుసేవాకేంద్రం, పశువైద్యశాలలో వైద్యుడ్ని సంప్రదించాలన్నారు. వేసవి కాలంలో పశుగ్రాసం కొరత ఉండడంతో పశువులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రాయితీపై ఇచ్చే దాణా ఉపయోగపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 46, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 46, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 34, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 80, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించండి

యూసీడీ అధికారులకు నగర మేయర్ సూచన



యూసీడీ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలో అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు జీవీఎంసీ యూసీడీ విభాగం సిబ్బంది సకాలంలో అందించాలని, మహిళల ఆర్థిక పురోగతికి సహకరిస్తూ చిత్తశుద్ధితో అధికారులు విధులను నిర్వహించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) సత్యవేణి, ఇతర యూసీడీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తోందని, అయితే వాటిని సక్రమంగా అర్హులైన వారికి అందించడం ఉద్యోగుల బాధ్యత అన్నారు. అప్పుడే ప్రభుత్వానికి, జీవీఎంసీకి మంచి పేరుతో పాటు మంచి పాలన అందించేందుకు అవకా శం ఉంటుందన్నారు. నగరంలో ఏయే కేటగిరిల్లో ఎన్ని ఫించన్లు పంపిణీ చేస్తున్నారనే విషయమై ఆరా తీశారు. నైట్ షెల్టర్లను రాత్రి 11 గంటల తర్వాత అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. నగరంలో ఉన్న 25 అన్న క్యాంటీన్లను అధికారులు సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలని, నైట్ షెల్టర్లతో పాటు అన్న క్యాంటీన్లను ఆకస్మికంగా తాను తనిఖీలు నిర్వహిస్తానని అన్నారు. అన్న క్యాంటీన్లో భోజనం చేసి నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానన్నారు. నగరంలో నిర్మించిన టిడ్కో గృహాల్లో అనర్హులు ఉన్నారని, చాలా చోట్ల టిడ్కో గృహాలు ఖాళీగా ఉన్నాయని, మొత్తం టిడ్కో గృహాల జాబితా వాటి వివరాలు అందించాలని ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. కొంతమంది ఆర్పీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రజలకు మంచి సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని యూసీడీ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు అధికారులు డి.లక్ష్మి, సూర్యకళ, డీపీవోలు హనుమంతు శంకర్, సురేష్, డిప్యూటీ తహసీల్దారు నాగలక్ష్మి, ఏపీడీలు ఇతర యూసీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరాభివృద్దే ధ్యేయంగా పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం 3వ జోన్ 15వ వార్డుపరిధిలోని కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో పలు రక్షణ గోడల నిర్మాణానికి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి సహకరిస్తున్నారని, విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు పలు కంపెనీలు నగరంలో నెలకొల్పుతున్నాయని తెలిపారు. వెంకోజీపాలెం కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు చాలా అవసరం ఉన్నందున కార్పొరేటర్ సూచనల మేరకు రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో పలు కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ రక్షణ గోడల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-3 కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్, సచివాలయం కార్యదర్శులు, టీడీపీ నాయకులు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి,వరలక్ష్మి, పార్వతి, సోని, గ్రామ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా పోలమాంబ అమ్మవారు



మద్దిలపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు. అయిదు, రెండు, వంద, యాభై రూపాయల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం కృష్ణుడు ఆలయం వద్ద నిర్వహించిన 'రేలారే రేలా...'సాంస్కృతిక కార్యక్రమం ఉర్రూతలూగించింది. ఈ వేడుకల్లో సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి, కార్యనిర్వహక కార్యదర్శి చెల్లిబోయిన సునీల్‌కుమార్, కార్యదర్శులు మువ్వల మౌళి, ఎం.హరిప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

గెడ్డ పూడిక తీసేందుకు దారి కోసం నర్సరీ స్థలం పరిశీలన

ఎంవీపీ కాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలోని వీఎమ్మార్డీఏ నర్సరీ వెనుక స్థలాన్ని మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం పరిశీలించారు. ఓ గెడ్డలో పూడిక తొలగించేందుకు వీలు లేనందున, సమీపంలోని కొంత ప్రాంతాన్ని కేటాయిస్తే, అక్కడ నుంచి ఎక్స్‌కవేటర్ ద్వారా పనులు చేయించడానికి వీలవుతుందని, ఈ మేరకు ఎంవీపీలోని వుడా నర్సరీలో కొంత స్థలం కేటాయించాలని కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలారావు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను కొద్ది రోజుల క్రితం కోరారు. హనుమంతువాక మీదుగా ఎంవీపీ రెండు, ఆరు, ఏడు, ఎనిమిది సెక్టర్ల నుంచి వానవానిపాలెం వద్ద సముద్రంలో కలిసే గెడ్డ ప్రవాహానికి ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరు వద్ద గెడ్డలో పూడిక పేరుకుపోతోంది. దీనివల్ల ఆ పక్కన ఉన్న స్కీమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి దుర్గంధం వెదజల్లడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కడకు ఎక్స్‌కవేటర్ తీసుకెళ్లి శుభ్రం చేయడానికి అనువుగా లేదు. గెడ్డను ఆనుకుని వీఎమ్మార్డీఏ నర్సరీ ఉంది. నర్సరీలోకి ఎక్స్‌కవేటర్ ప్రవేశించే అవకాశం కల్పిస్తే అక్కడి నుంచి గెడ్డను శుభ్రం చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి కొంత స్థలాన్ని కేటాయిస్తే, ఎక్స్‌కవేటర్, లారీలు వెళ్లేందుకు వీలుగా ర్యాంప్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే, ఎప్పటికప్పుడు గెడ్డ పూడిక తొలగించడానికి అవకాశం ఉంటుంది.

ఈ మేరకు వీఎమ్మార్డీఏ అధికారులతో స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడి పరిస్థితిని కమిషనర్‌కు నివేదించి, తగిన చర్యలు తీసుకుంటామని వీఎమ్మార్డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ తెలిపారు.

20న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

మద్దిలపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమ్మెలో భాగంగా జిల్లాలో ఈనెల 20న చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పి.వెంకట్రావు, డి.అప్పలరాజులు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం సీపీఎం కార్యాలయంలో గురువారం వారు జాతీయ సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కార్మికవర్గం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం దారుణమన్నారు. కార్మికులకు నష్టదాయకమైన ఆ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వ రంగంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, అసంఘటిత, సంఘటిత రంగాల్లో ఈ నెల 20 న చేపట్టబోయే జాతీయ సమ్మెపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 20న సమ్మెలో భాగంగా రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ బొమ్మ వరకు ర్యాలీ అనంతరం సభ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, సింహాచలం, లక్ష్మణరావు, వెంకటరావు పాల్గొన్నారు.

కరాచీవాలా ఇక్కడివారే

» బీజేపీ నగర అధ్యక్షుడు మంతెన పరశురామరాజు స్పష్టీకరణ

» కరాచీవాలా నేమ్‌బోర్డుపై మూసివేసిన పేపర్స్‌ను తొలగించిన నాయకులు



కరాచీ అన్న పదంపై మూసేసిన పేపరును తొలగిస్తున్న బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామ్‌రాజు

సిరిపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): కరాచీవాలా డిపార్ట్‌మెంటల్ స్టోర్ యజమానులు భారతదేశానికి స్వాతంత్య్రం రాకముందే వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని బీజేపీ నగర అధ్యక్షుడు మంతెన పరశురామరాజు తెలియజేశారు. సిరిపురం దత్ ఐలాండ్ వద్ద కరాచీవాలా డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌ను తొలగించాలని ఇటీవల నిరసన వ్యక్తం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో నేమ్‌బోర్డుపై మూసేసిన పేపర్స్‌ను స్వయంగా పరశురామరాజు తొలగించారు. ఆయన మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్య్రం రాకముందు సింధు నది పరివాహక తీరంలోని కరాచీ అనే ప్రాంతంలో వీరంతా నివసించేవారన్నారు. అక్కడి నుంచి వీరు విశాఖకు వలస వచ్చి స్థిరపడి కరాచీవాలా పేరుతో డిపార్ట్‌మెంటల్ స్టోర్‌ను నడుపుకుంటున్నారన్నారు. పాకిస్థాన్‌కు, వీరికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఇటీవల కాలంలో కరాచీ స్టోర్స్‌పై జరిగిన దాడికి బీజేపీ, భారతీయ యువ మోర్చాకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నానన్నారు. ఇదే విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటివాటికి బీజేపీ దూరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధోని నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిలీప్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ సాయిసుదర్శన్, కాటూరి రవీంద్ర, ఎం.శంకర్, వై.రవికుమార్, జి.రోహిత్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం పునఃప్రారంభం



కళ్యాణమండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

ఎంవీపీ కాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పదిహేడో వార్డు పరిధిలోని ఎంవీపీ ఒకటో సెక్టరులో శిథిలావస్థలో ఉన్న వీఎమ్మార్డీఏ కల్యాణమండపం ఇటీవల రూ.40 లక్షలతో ఆధునీకీకరించారు. దీన్ని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు నియోజకవర్గం శాశనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ చేతుల మీదుగా గురువారం ప్రారం భించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటరు గేదెల లావణ్య, బోలిశెట్టి సత్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏయూ లైబ్రరీని సందర్శించిన ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్

వెంకోజీపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు ఏయూ గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాలకు గ్రంథాలయాలు ఉపయుక్తంగా ఉండాలన్నారు. గ్రంథాలయాల వల్ల జ్ఞానప్రసరణ జరుగుతుందని, దీనివల్ల సమాజానికి ఎంతో మేలు సమకూరుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలో గల తాళపత్ర గ్రంథాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



ఏయూను సందర్శించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావుతో గ్రంథాలయ సిబ్బంది

అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్



సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని శివాజీపాలెం, కేఆర్ఎం కాలనీ ప్రాంతంలోని అనారోగ్యానికి గురైన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం అందించారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శివాజీపాలెం ప్రాంతానికి చెందిన లేబురు గిరిబాబుకు రూ.20 వేలు, కేఆర్ఎం కాలనీకి చెందిన సింహాద్రి నాగమణికి రూ.20,524లు మంజూరు కాగా, ఆ పత్రాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బీచ్ రోడ్డు, మే 8 (ఆంధ్రజ్యోతి) : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పోర్టు పూల్ కలాసీలు గురువారం దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలాసీలు మాట్లాడుతూ విశాఖ పోర్టులో గత 30 సంవత్సరాలుగా పూల్ కలాసీలుగా పని చేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో బతుకులు నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందిస్తూ.. పోర్టు చైర్మన్‌తో పాటు కేంద్ర మంత్రి దృష్టికి వీలైనంత త్వరగా సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కలాసీలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోర్టు పూల్ కలాసీలు యూనియన్ నాయకులు వాసుపల్లి రాము,శంకర్, ఖలీషా, శ్రీనివాస్, భీమారావు, పి.హరి తదితరులు పాల్గొన్నారు.

యథాస్థానంలో జిమ్ పరికరాల ఏర్పాటు

పార్కులో తొలగింపుపై వ్యతిరేకతతో అధికారుల దిద్దుబాటు చర్యలు



తొలగించిన జిమ్ పరికరాలు యథా స్థానంలో ఏర్పాటు చేసిన జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని పిఠాపురం కాలనీ పార్కులో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించిన జిమ్ పరికరాలను గురువారం మళ్లీ వారే యథా స్థానంలో ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జీవీఎంసీ పార్కులోని జిమ్, క్రీడా పరికరాలు తొలిగించడం వివాదమైంది. పిఠాపురం కాలనీ పార్కులో అక్రమ నిర్మాణాలు, అక్రమ వ్యాపారాలు తొలగించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. దీంతో పార్కులోని అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలు తొలగించాలని జిల్లా కలక్టర్ ఆదేశించడంతో బుధవారం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పార్కు వద్దకు వచ్చారు. పార్కులో ఎలాంటి నిర్మాణాలు, వ్యాపారాలు కనిపించకపోయేసరికి ఫిర్యాదు చేసిన కార్పొరేటర్‌కు ఫోన్ చేసి ఇక్కడ నిర్మాణాలేవి లేవని చెప్పగా, పార్కులో క్రీడాపరికరాలు, కళావేదికే అక్రమ నిర్మాణాలని, అవే తొలగించాలని చెప్పడంతో ఖంగుతిన్నారు. చేసేది లేక జిమ్ పరికరాలు, ఆటవస్తువులు పెకిలించారు. అయితే దీనిపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. అధికారులు, కార్పొరేటర్ తీరుపై స్థానికులు నిరసన తెలిపారు. ఈ విషయం రచ్చ కావడంతో పార్కులో తొలగించిన క్రీడా సామగ్రి, వ్యాయామ పరికరాలను యథాస్థానంలో ఏర్పాటు చేశారు.

వికసించిన మే పుష్పం



ఆరిలోవ, మే 8 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలిలోని కొండవాలు ప్రాం తంలో ఉన్న ఈశ్వరదేవినగర్‌లో ఒక ఇంటి పెరటిలో మే పుష్పం వికసించింది. ఈ పుష్పం మే నెల మొదటివారంలో మాత్రమే వికసి స్తుందని ఇంటి వారు తెలిపారు.. సుమారు నాలుగు సంవత్సరాల నుంచి ఈ పుష్పం మే నెలలో మాత్రమే వికసిస్తుందని వారు తెలి పారు. దాదాపు ఏడు రోజుల వరకు ఉంటుందని తెలిపారు. దీని నుంచి మంచి పరిమళం వెదజల్లుతోంది. ఈ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

చర్లపల్లి-బ్రహ్మపూర్ మధ్య నేటి నుంచి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ మీదుగా చర్లపల్లి-బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07027 నంబరు గల రైలు ఈ నెల 9 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.25 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 2.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07028 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.43 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 11.35 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు.

మ్యూజికల్ ఫౌంటెన్ పునఃప్రారంభం

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ సెంట్రల్ పార్కులో గతకొంతకాలంగా నిలిచిపోయిన మ్యూజికల్ ఫౌంటెన్ పునఃప్రారంభమయ్యింది. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ గురువారం దీన్ని పునఃప్రారంభించారు. నూతన పాటలతో రూపొందించిన ఈ ఫౌంటెన్ విశాఖ సెంట్రల్ పార్కుకు వచ్చే సందర్శకులకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ వెల్లడించారు. దీనివల్ల పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన కలెక్టర్, డీఆర్వో

» రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా
150 మంది అధికారులు, సిబ్బంది రక్తదానం



కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఆర్ఓ భవానీశంకర్‌ల రక్తదానం

మహారాణిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన కనిపించింది. గురువారం రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలోనూ, జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలోనూ రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ సహా పలువురు అధికారులు రక్తదానం చేశారు. రక్తదానం ఆవశ్యకతను తెలియజేస్తూ స్వయంగా కలెక్టర్ రక్తదానం చేయడంతో ఆయన స్ఫూర్తితో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రెడ్‌క్రాస్ బృందం కలిపి సుమారు 150 మంది రక్తదానం చేశారు. డీఆర్వో భవానీశంకర్ సైతం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఐపీల భద్రతలో పీఎస్ఓలకు సమయస్ఫూర్తి తప్పనిసరి: సీపీ



ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు వ్యక్తిగత భద్రత అధికారులు(పీఎస్ఓ)గా పనిచేసేవారికి సమయస్ఫూర్తి తప్పనిసరి అని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. నగర పోలీస్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో పీఎస్ఓలుగా పనిచేస్తున్న 69 మందికి వృత్తినైపుణ్యం పెంచేందుకు వీలుగా రెండు రోజులు నిర్వహించిన క్యాప్సూల్స్ కోర్సు శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ నుంచి ఇద్దరు అనుభవజ్ఞులైన అధికారులు వచ్చి విషయాలను పీఎస్ఓలకు తెలియజేశారన్నారు. రెండు రోజుల కోర్సులో నేర్చుకున్న అంశాలు ప్రతీ పీఎస్ఓకి విధి నిర్వహణలో మరింత సమర్థంగా పనిచేసేందుకు తోడ్పడతాయనడంలో అనుమానం లేదన్నారు. పీపీటీ, రోడ్ షో, బహిరంగసభలు, రోడ్డు ప్రయాణాలు, ఇతర ప్రయాణాల సమయంలో ప్రముఖుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాంబ్ డిటెక్షన్ డిస్పోజింగ్, ఫుడ్‌సేఫ్టీ, ఫైర్‌సేఫ్టీ, ఎస్ఐబీ, డ్రోన్, ఫస్ట్ ఎయిడ్‌తోపాటు అత్యవసర సమయాల్లో వీఐపీల భద్రతకు చాకచక్యంగా తీసుకోవాల్సిన చర్యలపై మరింత అవగాహన పెంచుకునే అవకాశం పీఎస్ఓలకు లభించిందన్నారు. వీఐపీల భద్రత విషయంలో నిరంతరం తెలివిగా వ్యవహరించాలని, అన్ని కోణాల్లోనూ భద్రతను అంచనా వేయాలని సూచించారు.

నైట్ ఫుడ్ కోర్టుపై పిల్లిమొగ్గలు

... 5వ పేజీ తరువాయి

తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం ఫుడ్‌కోర్టులో 170కి పైగా దుకాణాలు ఉన్నాయి. నలుగురైదుగురు వ్యక్తులు పదేసి దుకాణాలను ఏర్పాటు చేసి, వాటిని అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. దుకాణదారుల నుంచి ప్రతిరోజూ రూ.300 నుంచి రూ.500 వసూలు చేసి ఫుడ్‌కోర్టుకు అండదండలు అందించిన నేతలకు, సంబంధిత కార్పొరేటర్లకు వాటాలు ఇచ్చే బాధ్యతను ఒక వ్యాపారి తీసుకున్నారు. జీవీఎంసీకి ఫుడ్‌కోర్టు వల్ల ఒక్క రూపాయి ఆదాయం రాకపోయినా సరే పారిశుధ్య సిబ్బందితోనే అక్కడ పనులు చేయించేవారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పెద్దఎత్తున ఆరోపణలు గుప్పించారు. జీవీఎంసీకి ఆదాయం రాని అనధికార ఫుడ్‌కోర్టును అక్కడి నుంచి తొలగించాలంటూ కౌన్సిల్ సమావేశంలో ఆందోళన చేసేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఫుడ్‌కోర్టును అక్కడి నుంచి తొలగించాలని నిర్ణయిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. తర్వాత దీనిని అమలు చేయకుండా తాత్సారం చేయడంతో టీడీపీ, జనసేన కార్పొరేటర్లు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఫుడ్‌కోర్టును పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో వారం తర్వాత అక్కడే ధర్నాకు దిగుతామంటూ అల్టిమేటం జారీచేశారు. దీంతో అధికారులు ఫుడ్‌కోర్టును అక్కడి నుంచి తొలగించేందుకు కసరత్తు ప్రారంభించారు.

ఫుడ్‌కోర్టును తొలగించేందుకు అధికారులు సన్నద్ధం కాగా ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లకు వాటాలుగా పంచే బాధ్యత చూస్తున్న దళారి రంగంలోకి దిగాడు. కూటమిలో కొందరు ప్రజాప్రతినిధులతోపాటు కార్పొరేటర్లలో కీలకంగా వ్యవహరిస్తున్న వారిని ప్రసన్నం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో ఫుడ్‌కోర్టు తొలగింపు విషయంలో తొందరపడొద్దంటూ అధికారులకు ఆదేశాలు అందాయి. ఫుడ్‌కోర్టును తొలగించాలని చాలాకాలంగా పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు వెనక్కి తగ్గితే విమర్శలు ఎదుర్కొనాల్సి వస్తుందని కూటమిలో కొంతమంది కార్పొరేటర్లు అంటున్నారు. మేయర్ పీఠం కైవసం చేసుకున్న తర్వాత గత పాలకవర్గం చేసిన తప్పిదాలను సరిదిద్దడం ద్వారా ప్రజల్లో గుర్తింపు సంపాదించుకోవాల్సిన సమయంలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని ఫుడ్‌కోర్టు తొలగింపునకు అడ్డుపడుతున్న కార్పొరేటర్లకు చెబుతున్నారు. ఫుడ్ కోర్టులో ప్రస్తుతం ఉన్న దుకాణాలను తొలగించాలని, అవసరమైతే తిరిగి అదేచోట జీవీఎంసీకి ఆదాయం వచ్చేలా అర్హులైన వారికి డ్రా లేదా వేలం ద్వారా దుకాణాలను కేటాయించాలని సూచిస్తున్నారు. కూటమి కార్పొరేటర్లలోనే భిన్న వాదనలు మొదలవ్వడంతో ఫుడ్ కోర్టుపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారని ఆసక్తిగా మారింది.

సిటీ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు

... 5వ పేజీ తరువాయి

ఇంజనీరింగ్ అధికారులు, గ్యారేజీ అధికారులతో కొద్దిరోజుల క్రితం సమావేశమయ్యారు. త్వరలో ఈ రెండు ప్రాంతాలకు విద్యుత్, ట్రాన్స్‌ఫార్మర్లు, చార్జింగ్ ఎక్విప్‌మెంట్ వంటి సమకూరుస్తామని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. రెండో విడతలో మధురవాడ డిపోను ఈ-బస్సుల డిపోగా మారుస్తామని ప్రకటించారు. మొదటి విడతగా విశాఖ రీజియన్‌కు వచ్చిన ఈ-బస్సులను గాజువాక, సింహాచలం డిపోలు కేంద్రాలుగా నగరంలోని ప్రధాన రహదారుల్లో నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు తయారుచేశారు. సింహాచలం నుంచి ద్వారకా కాంప్లెక్సు, పాత పోస్టాఫీస్, ఆర్‌కే బీచ్, సింధియా ప్రాంతాలకు, గాజువాక నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్కే బీచ్, సింహాచలం, పెందుర్తి ప్రాంతాలకు నడిపేందుకు నిర్ణయించారు. రెండో దశలో రానున్న ఈ-బస్సులను ఇతర రూట్లలో నడిపేందుకు నిర్ణయించారు.

మానసిక వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సీతంపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): తాళికట్టిన భర్తను కాదని మరో యువకుడిని ప్రేమించి వివాహం చేసుకున్న ఓ మహిళ చివరకు వేధింపులకు గురై మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడింది. విశాఖపట్నంలోని ద్వారకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శ్రీకాకుళం జిల్లా టెక్కలి రంగాపురానికి చెందిన ఎల్.శ్రావణికి 2022లో బి.మాధవరావుతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. అయితే శ్రావణి చదువుతానని చెప్పడంతో నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆమెను భర్త చేర్పించాడు. కళాశాల్లో చదువుతున్న సమయంలో కొమర రోహిత్‌కుమార్ ఆమెకు పరిచయం కావడం వారి మధ్య ప్రేమకు దారితీసింది. దీంతో శ్రావణి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి మాధవరావుతో ఇకపై ఉండనని, రోహిత్‌కుమార్‌ని వివాహం చేసుకుంటానని తెలిపింది. ఈ క్రమంలో మాధవరావుకు విడాకులిచ్చింది. అనంతరం రోహిత్‌కుమార్, శ్రావణి కుటుంబాల అంగీకారంతో వీరికి రిజిస్టర్ వివాహం జరిగింది. ఇద్దరూ కొద్ది రోజులు హైదరాబాద్‌లో ఉండి అనంతరం విశాఖపట్నం వచ్చి కాపురం పెట్టారు. శ్రావణిని ద్వారకా పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఒక హాస్టల్‌లో రోహిత్‌కుమార్ ఉంచాడు. వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. శ్రావణి తనతో కలిసి ఉండమని కోరినప్పుడు రోహిత్ దురుసుగా వ్యవహరించేవాడు. అద్దె చెల్లించే ఆర్థిక స్తోమత తనకు లేదని, కలిసి జీవించాలంటే తన ఖర్చులు తానే భరించాలని శ్రావణిని వేధించేవాడు. అంతేకాకుండా ఆమెను వివాహం చేసుకున్నందుకు చింతిస్తున్నానని, నువ్వు చనిపోతే తాను సంతోషంగా ఉంటానని రోహిత్‌కుమార్ మాటలతో వేధించాడు. దీంతో విరక్తి చెందిన శ్రావణి బుధవారం క్రిమిసంహారక మందు తాగింది. హాస్టల్‌లో ఉన్నవారు చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పేదల బియ్యం పక్కదారి

» కైలాసపురం 46వ నంబర్ రేషన్ డిపోలో వెలుగుచూసిన బాగోతం
» పర్యవేక్షిస్తున్న డీలర్ రాకపోవడంతో షట్టర్ విరగ్గొట్టి స్టాకు వివరాలు నమోదు

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): కైలాసపురంలో రేషన్ డిపో నంబరు 46 నుంచి రెండున్నర టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్టు పౌర సరఫరాల అధికారులు గుర్తించారు. డిపోకు ప్రతి నెల 13.3 టన్నులు బియ్యం సరఫరా అవుతుంది. డిపో ఒరిజినల్ డీలర్ సౌజన్యపై గతంలో 6-ఎ కేసు నమోదు కావడంతో సమీపంలో మరో డీలర్ అప్పలసన్యాసినాయుడుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన డయాలసిస్ పేషెంట్ కావడంతో 6-ఎ కేసు నమోదైన ఒరిజినల్ డీలర్ సౌజన్యకు డిపోను అనధికారికంగా అప్పగించారు. నిబంధనల మేరకు కేసు నమోదైన వ్యక్తికి డిపో ఇవ్వకూడదు. కానీ అనారోగ్యకారణాలతో డిపోను తాత్కాలికంగా పర్యవేక్షించాలని కోరారు. రెండు రోజుల క్రితం డిపో నుంచి రెండున్నర టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్టు పౌరసరఫరాల అధికారులకు స్థానికులు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో సర్కిల్-2 సహాయ పౌరసరఫరాల శాఖ అధికారి కల్యాణి, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు కైలాసపురంలో డిపో వద్దకు వెళ్లి ఇన్‌చార్జి డీలరు అప్పల సన్యాసినాయుడుకు కబురుపెట్టారు. అయితే డిపో తాళాలు పాత డీలరు వద్ద ఉన్నాయని చెప్పడంతో ఆమెకు సమాచారం ఇచ్చారు. అయినా ఆమె రాకపోవడంతో డిపో షట్టర్ విరగ్గొట్టి లోపల ఉన్న స్టాకు వివరాలు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలతో స్టాకు సరిపోల్చారు. రెండున్నర టన్నులు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీలరు నుంచి వివరాలు సేకరించారు. తనకు ఆరోగ్యం సహకరించకపోవడంతో పాత డీలర్‌ను చూడాలని కోరారని స్టేట్‌మెంట్ ఇచ్చారు. గతంలో ఇదే డిపో నుంచి బియ్యం పక్కదారి పట్టడంతో నమోదుచేసిన కేసు ఇంకా పెండింగ్‌లో ఉంది. చివరకు ఇన్‌చార్జి డిపో డీలరుపై 6-ఎ కేసు నమోదుచేశారు.

సింహాచలం ప్రమాదంపై ముగ్గురికి సస్పెన్షన్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

చర్యలకు కూడా సిఫారసు చేశారు. అయితే మూడు రోజుల తరువాత గురువారం సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈఈ కె.సుబ్బారావు, ఏపీటీడీసీలో పనిచేస్తున్న ఈఈ కె.రమణ, డీఈ ఏఆర్‌వీఎల్ఆర్ స్వామిలకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ (విశాఖపట్నం) దాటి బయటకు వెళ్లవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన నలుగురు ఇంజనీర్లకు ఇంకా ఉత్తర్వులు అందలేదు. వీరిలో దేవస్థానానికి చెందిన ఇంజనీర్లు డీజీ శ్రీనివాసరాజు (ఈఈ), కేఎస్ఎన్ మూర్తి(డిప్యూటీ ఈఈ), కె.బాబ్జీ(జేఈ)లతో పాటు ఏపీటీడీసీకి చెందిన పి.మదన్‌మోహన్(ఏఈ) ఉన్నారు.

వారిపై విచారణ ఏదీ...?

సింహాచలం దేవస్థానం ఇంజనీరింగ్ విభాగంలో చాలామంది అర్హతలు లేకుండా ఇంజనీర్లుగా కొనసాగుతున్నారని, మరికొందరు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతులు పొందారంటూ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులే రెండేళ్ల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై గత దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పలువురు ఇంజనీరింగ్ ఉద్యోగులకు నోటీసులు జారీ చేసి, వివరణ కోరారు. ఇప్పటివరకూ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. ఇంజనీరింగ్ విభాగం అంతా గందరగోళంగా ఉందని, అర్హతలు లేని వారు కొనసాగుతున్నారని, నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు లేవని ప్రభుత్వమే గుర్తించిన నేపథ్యంలో ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఇప్పటికైనా తప్పు చేసిన వారిని రక్షించే కార్యక్రమాలకు స్వస్తి పలికి తగిన చర్యలు తీసుకోవలసి ఉంది.

రైలు ప్రయాణికుల దాహార్తి తీర్చిన సేవాబృందం



ఉక్కునగరంలోని శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

అక్కయ్యపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుల దాహార్తి తీర్చారు శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు. వేసవిలో దూర ప్రయాణాలు చేసే వారి దాహం తీర్చాలని దువ్వాడ రైల్వే స్టేషన్ వారు ఉక్కునగరంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి జెంట్స్ సేవాదళ్ వారిని అభ్యర్థించారు. దీంతో దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులోని రిజర్వేషన్ ప్రయాణికులకు, జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ఉన్నవారికి మొత్తం 600 నీళ్ల సీసాలను అందించారు. ఈ సేవా కార్యక్రమంలో ఉక్కు నగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, జాయింట్ కన్వీనర్ ఎస్‌కెఆర్‌కె రాజు, పైడినాయుడు, అగనంపూడి భజన మండలి కన్వీనర్ జి.వి. ప్రసాద్, కర్రి శ్రీనివాస్, సన్యాసిరాజు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు. వీరి సేవలను పలువురు అభినందించారు.

విశాఖలో క్రీడాభివృద్ధికి పూర్తి సహకారం : శాప్ చైర్మన్ రవినాయుడు



క్రీడా సామగ్రి కిట్లను అందజేస్తున్న కలెక్టర్ హరింధరప్రసాద్, 'శాప్' చైర్మన్ రవి నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తదితరులు

మహారాణిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో అన్ని రకాల క్రీడల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాభివృద్ధి సంస్థ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరిప్రసాద్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు, పలువురు క్రీడా ప్రతినిదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ క్రీడల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం వివిధ క్రీడా సంఘాల సమన్వయం ఎంతో కీలకమన్నారు. విశాఖలో క్రీడాభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ వేసవిలో శాప్ ద్వారా 50 వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు క్రీడా అకాడమీల ఏర్పాటుకు కృషి చేయనున్నట్టు తెలిపారు అనంతరం అధికారులతో కలిసి వేసవి క్రీడా శిబిరాల క్రీడా సామాగ్రి కిట్లును అందించారు.

భక్తిశ్రద్ధలతో ప్రసన్నవెంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అల్లిపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురం వెంకటేశ్వరమెట్ట బల్లగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ఆరాధన, నివేదన, విశేష హోమాలు, మంగళాశాసనం చేశారు. ఉదయం ధ్వజారోహణం, మధ్యాహ్నం రాజభోగం నివేదన జరిపారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆలయ ఈవో రమాబాయి పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవాన్ని ఆలయ అర్చకులు గొడవర్తి రఘునాథాచార్యులు, వేద పండితులు, మేళతాళాల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహోత్సవం కల్యాణ ఘట్టం మొత్తం భక్తులను పరవశింప జేసింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టికెట్ల లెక్కలపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

దృష్టికి వెళ్లింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలకే అన్ని టికెట్లు ఇవ్వనప్పుడు ప్రతిపక్ష పార్టీ కార్యకర్తకు ఎలా ఇచ్చారని ఆరా తీస్తున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో టికెట్లు తీసుకున్న వారి వివరాలు కూడా పరిశీలిస్తున్నారు.

వెహికల్ పాస్‌లు అమ్ముకున్నారు

అంతకు ముందు ఏడాది ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయిపోయి భక్తులు కాలినడకన రాకపోకలు సాగించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొండపైకి పరిమితంగా అంటే కేవలం 150 వాహనాలను మాత్రమే అనుమతిస్తామని పోలీస్ కమిషనర్ ప్రకటించారు. ఆ విధంగానే ఎవరికీ వెహికల్ పాస్‌లు ఇవ్వలేదు. అయితే దేవస్థానం అధికారులు మాత్రం కొండపై సేవలు అందించే సంస్థలు ఉన్నాయని, వారు ప్రసాదాలు, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తాయని వాటికి పాస్‌లు అవసరమని 400 తీసుకున్నారు. వాటిలో కేవలం 40 పాస్‌లు స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇచ్చి, మిగిలిన పాస్‌లను, అడ్డగోలుగా దక్కించుకున్న వేయి రూపాయలు, రూ.1,500 టికెట్లను కొందరు అధికారులు అధిక ధరలకు అమ్ముకొని జేబులు నింపుకొన్నారు. ఈ విషయం ఇప్పటివరకూ ఎక్కడా బయటకు పొక్కలేదు. దేవస్థానం ఉద్యోగులు కొందరు వేయి రూపాయల టికెట్లు ఒక్కొక్కటి రూ2 వేలు చొప్పున అమ్ముకున్నారని తెలిసింది గానీ వెహికల్ పాస్‌లు అమ్ముకున్న విషయం బయటకు రాలేదు. దీనిపై కూడా విచారణ చేస్తే కొండపై దొంగలు ఎవరో రంగు బయటపడుతుంది.

పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు



ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న పోలీసులు

డాబాగార్డెన్స్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎర్రంనాయుడు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్, డీసీపీ ఆదేశాల మేరకు గురువారం రాత్రి టూ టౌన్ పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్స్, కల్లుపాకలు, చావులమదుం తదితర ప్రాంతాల్లోని బృందాలుగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రస్తుతం వేరే ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారితో పాటుగా నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. గంజాయి, డ్రగ్స్, మారణాయుధాలు గానీ అక్రమ రవాణా నిలిపివేసేందుకు క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని కొన్ని బస్సులతో పాటు ఇతరత్రా వాహనాలల్లో విస్తృత తనిఖీలు పట్టామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు సతీష్, సింహాచలం, మన్మథరావు, పోలీసులు పాల్గొన్నారు.

'దీపం' ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ



లబ్ధిదారుకు గ్యాస్ సిలిండరు అందజేస్తున్న ఎమ్మెల్యే

మహారాణిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : దీపం పథకం-2లో భాగంగా ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేపట్టారు. గురువారం జీవీఎంసీ 29వ వార్డులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సూపర్ 6 పథకంలో ఒకటైన ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేపట్టామన్నారు. సిలిండర్ బుక్ చేసిన 48 గంటల్లోనే రాయితీ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మన్యాల శ్రీనివాస్ అంగటి శ్రావణ కుమార్, బుద్ధల అనురాధతో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుల నెత్తిన పాలు

... 5వ పేజీ తరువాయి

తదితర అంశాలను ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య (ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్) పర్యవేక్షించనున్నది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డెయిరీలను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీని తీసుకువచ్చింది. అమూల్ డెయిరీ ప్రైవేటు సంస్థ అయినప్పటికీ ప్రతి జిల్లాలో ఉపాధి హామీ నిధులతో పాల సేకరణ కేంద్రాలు, ప్రధానమైనచోట్ల పాల శీతలీకరణ సెంటర్లు ఏర్పాటుచేసింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు అమూల్ కోసం పనిచేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి అమూల్‌కు పాలు పోసే రైతులకు రుణాలు మంజూరుచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా ఉండే డెయిరీల కంటే అమూల్ ప్రయోజనాలకు పెద్దపీట వేయడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అమూల్ డెయిరీ విషయంలో అధికారులపై ఒత్తిడి తగ్గింది. గ్రామీణ మహిళలకు సాధికారిత కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కొత్తగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి జిల్లాలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా విశాఖ జిల్లాలో తొలివిడతలో 15 సంఘాలు ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటివరకూ జెర్రిపోతులపాలెం, మజ్జిపేట, దాకమర్రిలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. మిగిలిన 12 సంఘాలు నెలాఖరు నాటికి స్థాపించనున్నారు. ప్రతి సంఘానికి కార్యదర్శి, ప్రమోటర్, కో-ప్రమోటర్‌తోపాటు మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంతకంటే ఎక్కువ సభ్యులను చేర్చుకునే అవకాశం ఇచ్చారు. సభ్యులంతా పాడి పశువులు ఉన్నవారు వారై ఉండాలి. పాలు ఫలానా డెయిరీకి సరఫరా చేయాలన్న నిబంధనను ప్రభుత్వం తొలగించింది. ఎక్కువ రేటు ఇచ్చే డెయిరీకి పాలు సరఫరా చేసుకునే స్వేచ్ఛ సంఘానికి ఉంటుంది. సంఘం నిర్వహణ, పాల సేకరణ, పాల నాణ్యత, ఇత్యాది అంశాల కోసం ప్రతి సంఘానికి ప్రభుత్వం రూ.1.5 లక్షల విలువైన కంప్యూటర్, ప్రింటర్, యూపీఎస్, ఎనలైజర్, వెన్న శాతం కొలిచే పరికరం, తూకపు యంత్రం, డిస్‌ప్లే బోర్డు తదితర పరికరాలు సరఫరా చేస్తుంది. సంఘం నిర్వహణకు ప్రతి లీటరుకు కొద్దిమొత్తం సంబంధిత డెయిరీ చెల్లించాలని నిబంధన పెట్టారు. పాలుపోసే రైతులకు డీసీసీబీ బ్యాంకుల్లో ఖాతాలు ఓపెన్ చేస్తారు. డెయిరీ నుంచి పాల సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. పాల సేకరణ ప్రారంభం తరువాత పశువులకు దాణా కోసం ప్రతి రైతుకు రూ.50 వేల వరకు రుణాలు ఇవ్వనున్నారు. కాగా అన్ని జిల్లాల్లో 1964 సహకార సంఘాల చట్టం నిబంధనల మేరకు మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ప్రతినిధి రాకేష్ తెలిపారు. సంఘాల ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతుందని, త్వరలో పాల సేకరణ ప్రారంభిస్తామన్నారు. ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండే డెయిరీలకు రైతులు పాలు విక్రయించవచ్చునని, ఈ విషయంలో ఎటువంటి ఒత్తిడి, షరతులు లేవన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద పార్కింగ్ ఫీజు బాదుడు!

- 24 గంటలకు 2 రూపాయలు ఉన్న పార్కింగ్ ఫీజు రూ.30కు పెంపు
- ఉక్కు యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు
- ఫీజు ధరలు తగ్గించకపోతే ఉద్యమిస్తామంటున్న కార్మిక సంఘాల నాయకులు



కూర్మన్నపాలెం ఆర్చి వద్ద పార్కింగ్ స్థలంలో ఉన్న ద్విచక్ర వాహనాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్డులో ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఫీజును భారీగా పెంచేశారు. ఎంతలా అంటే ఒక్కో వాహనానికి రెండు రూపాయల నుంచి రూ. 30 వరకు పార్కింగ్ ఫీజును ఈ నెల ఒకటో తేదీ నుంచి పెంచేయడంతో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంటుకు బస్సు సౌకర్యం తక్కువగా ఉంటుంది. కూర్మన్నపాలెం కూడలి వరకు మాత్రమే బస్సు సర్వీసు ఉంటుంది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి ఉక్కు కర్మాగారానికి వచ్చే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కూర్మన్నపాలెం వరకు వచ్చి అక్కడ పార్కింగ్ చేసిన తమ ద్విచక్ర వాహనాలపై ప్లాంటుకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఉక్కు టౌన్‌షిప్ వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు గాను కూర్మన్నపాలెం వరకు ద్విచక్ర వాహనాలపై వచ్చి అక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేసి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు.

గతంలో కార్మిక సంఘ నాయకుల ఒత్తిడి మేరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సీఎస్సార్ నిధులతో కూర్మన్నపాలెం ఆర్చి సమీపంలో రెండు భారీ షెడ్లను నిర్మించింది. ద్విచక్ర వాహనాల పార్కింగ్ నిమిత్తం నామమాత్రం రుసుం వసూలు చేస్తూ ఉక్కు నిర్వాసిత నిరుద్యోగ దివ్యాంగులకు బాధ్యతలను అప్పగించింది. ఇక్కడ పార్కింగ్ ఫీజు కింద ఇంతకుముందు 12 గంటలకు గాను ఒక రూపాయి చొప్పున, 24 గంటలకు రూ.2 చొప్పున వసూళ్లు చేసేవారు. అయితే ఇటీవల నిర్వాసిత నిరుద్యోగ దివ్యాంగుల ఉపాధి కోసం ఏర్పాటైన ఈ పార్కింగ్ షెడ్డును ఆ కేటగిరి నుంచి తప్పించి ఓపెన్ కేటగిరిలోకి ఉక్కు యాజమాన్యం మార్చింది. దీంతో పార్కింగ్ ఫీజులను భారీగా పెంచేసింది. ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల వాహనాలకైతే 12 గంటలకు రూ.10, 24 గంటలకు రూ.20, ఇతరులకు (స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు కాని వారికి) అయితే 12 గంటలకు రూ.15, 24 గంటలకు 30 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు.

గతంలో ఒకరోజుకు 2 రూపాయలు ఉన్న పార్కింగ్ ఫీజును ఇప్పుడు ఏకంగా రూ.30కు పెంచేయడంతో ఉక్కు యాజమాన్యంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం లాభాపేక్షతో యాజమాన్యం వ్యవహరిస్తుందని వాపోతున్నారు. పెంచిన పార్కింగ్ ఫీజులను తగ్గించాలంటూ ఇప్పటికే సీఐటీయూ ప్లాంట్ కార్మిక సంఘం, కార్పొరేటర్ బి.గంగారావులు ఉక్కు యాజమాన్యానికి వినతిపత్రాన్ని అందజేశారు. యాజమాన్యం తక్షణమే స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. పార్కింగ్ ఫీజుల భారంపై తాము కూడా పోరాటాలు సాగిస్తామని నిర్వాసిత నాయకులు ప్రకటించారు.



భూమి పూజలో పాల్గొన్న 'పల్లా' దంపతులు

టీడీపీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ

గాజువాక, మే 8 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి గురువారం శ్రీకారం చుట్టారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు దంపతులు భూమి పూజ చేశారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 66వ వార్డు పరిధి బీసీ రోడ్డు ప్రాంతంలో నూతన కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్టు నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తెలిపారు. భూమి పూజలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్, నాయకులు ఎండీ.రఫీ, గోమాడ వాసు, అనంత్ పాల్గొన్నారు.

కబడ్డీ మైదానాన్ని ఏర్పాటు చేయాలని వినతి



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడును కలిసిన కబడ్డీ క్రీడాకారులు

గాజువాక, మే 8 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడాకారుల కోసం జిల్లాలో మైదానాన్ని ఏర్పాటు చేయాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవినాయుడును జాతీయ కబడ్డీ క్రీడాకారుడు మొల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో గాజువాక ప్రాంత కబడ్డీ క్రీడాకారులు కోరారు. నగరంలో చైర్మన్‌ను కలిసిన క్రీడాకారులు పలు అంశాలను ఆయనకు వివరించారు. జిల్లాలో కబడ్డీ క్రీడాకారులు అధికంగా ఉన్నారని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతోమంది రాణిస్తున్నారని, అయితే వారు సాధన చేసేందుకు సరైన మైదానం లేదన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు, క్రీడాకారులు నొల్లి తేజ, భానుప్రసాద్, గొందేశి సాయి, తదితరులు ఉన్నారు.

రాయితీపై పశువుల దాణా

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులు పెంచే రైతులకు 50 శాతం రాయితీపై దాణా సరఫరా చేస్తామని పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి సంయుక్త సంచాలకుడు డాక్టరు కరుణాకర్ తెలిపారు. 50 కిలోల బ్యాగ్‌తో ఉన్న దాణా రూ.1110లు కాగా, రూ.550లకు అందజేస్తామన్నారు. ప్రతినెలా 150 కిలోల వంతున మూడు నెలల దాణా అందజేస్తామన్నారు. రైతుల కోసం జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల దాణా వచ్చిందన్నారు. బియ్యంకార్డు కలిగిన రైతుకు రెండు పశువులు, ఒక దూడ ఉంటే రైతుసేవాకేంద్రం, పశువైద్యశాలలో వైద్యుడ్ని సంప్రదించాలన్నారు. వేసవి కాలంలో పశుగ్రాసం కొరత ఉండడంతో పశువులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రాయితీపై ఇచ్చే దాణా ఉపయోగపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సినిమా గైడ్

- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది)46, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 46, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 34, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 80, గోరుచిక్కుడు 30, దేముడుచిక్కుడు 44, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, కర్రపెండలం 18, మామిడిఅల్లం 56, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

పాత నేరస్థుడు అరెస్టు: చోరీ సొత్తు స్వాధీనం

పెదగంట్యాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): చోరీలకు అలవాటు పడిన పాత నేరస్థుడిని న్యూపోర్టు క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేయడంతో పాటు నిందితుని నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డీసీపీ లక్ష్మణరావు వెల్లడించారు. కంచరపాలెం బర్మా క్యాంప్‌నకు చెందిన కె.దిలీప్ (22) దయాళ్‌నగర్‌లో ఉంటున్న తన మిత్రుడు బేర రాజు ఈ నెల 6న ఇంటికి తాళం వేసి తన స్వస్థలమైన పాడేరు వెళ్లడం గమనించాడు. ఈ మేరకు అదేరోజు రాత్రి ఆ ఇంటి తాళం కట్ చేసి లోపలకు వెళ్లి బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి పట్టీలు, రూ.50 వేల నగదును దిలీప్ ఎత్తుకుపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

ఈ క్రమంలో దిలీప్ చోరీకి పాల్పడినట్టు గుర్తించి గురువారం ఊర్వశి జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకోవడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చిన్నతనం నుంచి చెడు అలవాట్లు, దొంగతనాలకు, జల్సాలకు అలవాటు పడ్డాడని డీసీపీ పేర్కొన్నారు. సమావేశంలో న్యూపోర్టు క్రైమ్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

చెట్టు పైనుంచి పడి కార్మికుడి మృతి

పెదగంట్యాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): తాటికాయలు కోసేందుకు చెట్టు ఎక్కిన ఓ కార్మికుడు దురదృష్టవశాత్తు జారిపడడంతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం శివరాజుపేట గ్రామానికి చెందిన పి.గణేశ్ (27) పెదగంట్యాడ ఏఎస్ స్టీల్ ట్రేడర్స్‌లో హైడ్రా హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కాయలు కోసేందుకు సమీపంలో ఉన్న తాటిచెట్టు ఎక్కాడు. అయితే చెట్టు పైనుంచి జారిపడడంతో సహచర కార్మికులు వెంటనే గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుని కుటుంబానికి తగిన ఆర్థిక సాయం అందించాలని సహచర కార్మికులు స్టీల్ ట్రేడర్స్ యాజమాన్యాన్ని కోరుతున్నారు.

ఘనంగా కుంచుమాంబ అనుపోత్సవం

అక్కిరెడ్డిపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత కుంచుమాంబ అనుపోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. షీలానగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఆలయానికి వేకువజాము నుంచే గవర జగ్గయ్యపాలెం, షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గవర జగ్గయ్యపాలెం నుంచి అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి పూజలు జరిపారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, ఎ.రాజు, కె.ముత్యాలనాయుడు, టి.సత్తిబాబు, ఎ.శ్రీను తదితరులు, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు జంటలు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బి.అప్పారావు, బి.శ్రీను, ఎం.రామచంద్రరావు, ఎస్ఎల్‌పీ రావు, పి.రామఅప్పారావు, వి.వరహాలు, అప్పారావు, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం: వైశాఖ ఏకాదశి సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించిన తిరుప్పావడ సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేదపండితులు శ్రీవారిని పంచామృతాలతో అభిషేకించి పూజలు చేశారు. 40 కిలోల పులిహోరను శ్రీవారి ఆకారంలో తీర్చిదిద్ది స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.



శ్రీవారికి నైవేద్యంగా సమర్పించిన పులిహోర

నేడు మెగా జాబ్‌మేళా

పెందుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మెగా జాబ్ మేళా జరగనుంది. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. 40 కంపెనీల ప్రతినిధులు హాజరై రెండు వేల మందికి ఉపాధి కల్పించనున్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉండి, పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివిన వారికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్లతో పాటు హోం మంత్రి అనిత, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హాజరుకానున్నారు.

పద్యాల్లో జీవిత సత్యాలు

మల్కాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగు పుస్తకాల్లో ముద్రించిన సుమతి, వేమన వంటి కవుల శతకాలు, నీతి పద్యాల్లో జీవిత సత్యాలు దాగున్నాయని న్యాయవాది జీకేవీ రాజు అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ఆయన మాట్లాడారు. సుమతీ శతకంలోని అనేక పద్యాలను తాత్పర్యాలతో సహా వివరించి అవి జీవితానికి ఏవిధంగా ఉపయోగపడతాయో తెలిపారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, వలంటీర్లు జ్యోతిర్మయి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేపగుంట, మే 8 (ఆంధ్రజ్యోతి) : చీమలాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వేపగుంట ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వేపగుంట, ముత్యమాంబ కాలనీ, బీసీ కాలనీ, గంగిరెడ్డి కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

రెండో రోజు 45 కిలోల చందనం అరగదీత

సింహాచలం, మే 8 (ఆంధ్రజ్యోతి) : చందనం అరగదీత గురువారం కూడా కొనసాగింది. వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 12న మూడు మణుగుల (125కిలోల) చందనం సమర్పించనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు వేకువజామున సుప్రభాతసేవ ప్రభాతారాధనలు తరువాత ఆలయ సిబ్బంది ఉదయం 7 నుంచి ఐదు గంటల పాటు చందనాన్ని అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనాన్ని ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేయగా 45 కిలోలు వచ్చింది. దాన్ని ఆలయ బాండాగారంలో భద్రపరిచారు.

సమ్మెను విజయవంతం చేయండి

మల్కాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న జరిగే పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వారు మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో సమ్మె పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా కేంద్రం మార్చేసి, ఎటువంటి హక్కులు లేకుండా చేసిందన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులు సమ్మె చేసే హక్కు, జీతాలు అడిగే హక్కు పూర్తిగా కోల్పోతారని తెలిపారు. కార్మిక సంఘాలు ఐక్యతతో ఉండి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేల చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌ను సక్రమంగా చెల్లించాలని, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం. జగ్గునాయుడు, జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె. సత్యనారాయణ, వైఎస్ఆర్‌టీ యూసీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, బీమ్‌షాప్ అధ్యక్ష, కార్యదర్శులు ధనంజయ, రామచంద్రరావు, మల్కాపురం జోన్ సీఐటీయూ అధ్యక్షుడు పెంటారావు, ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణమూర్తి, పైడిరాజు, సత్యారావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజా సంఘాల నిరసన ర్యాలీ

ఎన్ఏడీ జంక్షన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, దళిత క్రైస్తవులు గురువారం శాంతియుత ర్యాలీ, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులను దళితులుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకువచ్చి, రాజ్యాంగంలో ఇచ్చిన మత స్వేచ్ఛ హక్కును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకుడు జాకబ్‌రాజు, డీహెచ్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఆనంద్, నవీన్, శ్రీనివాస్, జయరాజు, శ్రీకుమార్, అంటోని, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరువీధి



పెందుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి) : వెంకటాద్రి శిఖరంపై కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి తిరువీధి వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాల రథంలో శ్రీవారిని అధిష్ఠింపజేసి, మేళతాళాలతో భక్తుల గోవింద నామ స్మరణ మధ్య ఆలయ శిఖరం నుంచి కొండ దిగువకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి చిన ముషిడివాడలో సప్తగిరినగర్‌లో ఉన్న అలివేలు మంగాదేవి ఆలయం వరకు రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



ర్యాలీలో పాల్గొన్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ

గాజువాక, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంతో దేశానికి చాలా ప్రమాదమని, ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో గురువారం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదులను అంతం చేసేందుకు ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేయడం పట్ల దేశ ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీ పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు తిరిగి అక్కడ నుంచి పాత గాజువాక వరకు సాగింది. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, బొండా యల్లజీరావు, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

ఉక్కుటౌన్‌షిప్, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న సీపీఐ మహాసభలకు సంబంధించిన పోస్టరును స్టీల్‌ప్లాంటులో గురువారం ఆ పార్టీ నాయకులు తాండ్ర కనకరాజు, యేల్లేటి శ్రీనివాస్, జి.ఆనంద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని, ప్రైవేటీకరణ చేయరాదని, 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చవద్దని, కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మహాసభలను కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కేఎస్ఎన్ రావు, డి.నరసింగరావు, జయ, నాగబాబు, నాయుడు, దేముడు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 72వ వార్డు అధ్యక్షుడిగా లక్ష్మణరావు

గాజువాక, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 72వ వార్డు అధ్యక్షుడిగా అక్కిన లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన వార్డు నాయకుల సమావేశంలో పార్టీ పరిశీలకుడు ఎన్వీ చౌదరి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వార్డు ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ కన్నారావు, కోశాధికారిగా టీవీ రమణారావు, ఉపాధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా పి.స్వామి, ఎం.పార్వతి, జగ్గారావు, మంగ, ఉషశ్రీ, కృష్ణారావులను ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డు టీడీపీ నూతన కమిటీకి కార్పొరేటర్ అభినందనలు

అగనంపూడి: టీడీపీ 79వ వార్డు నూతన కమిటీ సభ్యులను గురువారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఇక్కడి పార్టీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో విరివిగా కార్యక్రమాలను చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్, నాయకులు సత్యారావు, జి.రుద్రకుమార్, ఎం.వెంకటరావు, జి.వెంకటరావు, సుబ్బరాజు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అంత్యాక్షరి పోటీలు

పెదగంట్యాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఇక్కడి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు అంత్యాక్షరి పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు యాభై మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిని ఐదు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి శిబిరం ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని గ్రంథాలయ నిర్వాహణాధికారి పీవీ రమణ తెలిపారు.

యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్‌కు సూర్యనారాయణ

విశాఖపట్నం స్పోర్ట్సు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన కంచరాన సూర్యనారాయణ ను టెక్నికల్ అఫీషియల్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బిహార్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి సూర్యనారాయణ న్యాయ నిపుణుడిగా వ్యవహరిస్తారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టిం గ్ రిఫరీ అర్హత కలిగిన సూర్యనారాయణ అనేక అంతర్జాతీయ, జాతీయ టోర్నీలకు రిఫరీగా వ్యవహరించడమే కాకుండా భారత్ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షునిగా, ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఆయనను పలువురు అభినందించారు.